RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 220 శనివారం 08 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ




బదిలీ అయినవారిలో అడిషనల్ డీజీ, ఐజీపీ, డీఐజీలు

14 మంది ఎస్పీలకు స్థానచలనం

ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలకు స్థానచలనం

తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు, ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలు ఉన్నారు. 14 మంది ఎస్పీలకు స్థానచలనం కలిగింది.

## దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే డీలిమిటేషన్

- దక్షిణాదిలో బీజేపీకి 29 స్థానాలే అందుకే డీలిమిటేషన్
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది
- బిహార్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి బిమారీ రాష్ట్రాలకు డీలిమిటేషన్ లబ్ధి




డీలిమిటేషన్ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని విమర్శించారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం.

**ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది :** దక్షిణాదిలో బీజేపీకి తగిన ప్రాతినిధ్యం లేదని రేవంత్ రడ్డి అన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే, దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలో లేదని గుర్తు చేశారు. - మిగతా 2 లో

## ఏపీ జల దోపిడీపై రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలి




- 200 టీఏంసీల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర
- మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలింపు
- తెలంగాణ నీటి ప్రయోజనాలు ఈ సర్కారుకు పట్టవా?
- బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి?
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

## తమిళ భాషకు గుర్తింపు ఇస్తాం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు

భాషా విషయంలో స్టాలిన్ రాజకీయం చేయడం సరైంది కాదు

ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ఉన్నత విద్య కోసం తమిళ భాషలోనే సిలబస్

స్టాలిన్ ఇకనుంచైనా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలి




## మీడియా ముందే బోరున ఏడ్చేసిన కెనాడా ప్రధాని ట్రూడో




- ప్రధానిగా ఆయన పదవి కాలం మరో 3రోజులు మాత్రమే
- అమెరికా ఆ దేశంపై అవలంభిస్తున్న విధానాలు తలుచుకోని జస్టిన్ ట్రూడో భావోద్వేగానికి గురి
- ట్రంప్ సుంకాల కారణంగా కెనడాలో రాబోయే కాలం కష్టతరమని ఆవేదన

## ఈపీఎఫ్ ఖాతాదారులకు గుడ్ న్యూస్




- ఏటీఎం నుంచీ డబ్బు డ్రా
- కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డా. మన్‌సుఖ్ మాండవీయ
- ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ లావాదేవీలు ఇక 3.వెర్షన్‌లోకి
- సనత్ నగర్ ఈఎస్ఐసీ హాస్పిటల్, మెడికల్ కాలేజీ నెంబర్ 1

## ఎమ్మెల్సీగా నాగబాబు నామినేషన్

ఎమ్మెల్యే కోటా జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొణిదల నాగబాబు క్రితం నామినేషన్ దాఖలు చేశారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని మంత్రి నారా లోకేష్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బలపరిచారు.అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి వనితారాణికి నాగబాబు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నాగబాబు నామినేషన్ దాఖలు కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు, బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ

- ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో పార్టీ ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం
- తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం
- బడ్జెట్‌కు మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యే అవకాశం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కూడగట్టేలా బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం



ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈనెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తున్నారు.బడ్జెట్ సమావేశాల వేళ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారనే - మిగతా 2 లో

## మొదటిపేజీ తరువాయి

# ఏపీ జల దోపిడీపై రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జల దోపిడీపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జల దోపిడీపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తున్నాం, తెలంగాణకు నష్టం లేదు అని ఏపీ నీళ్ల మంత్రి అంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మౌనం వహించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తం కుమార్ రెడ్డి సహా ఒక్క నాయకుడికి పట్టింపు లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. "బనకచర్ల తో తెలంగాణకు ఏమి నష్టం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించలేదు. తెలంగాణ నీటి ప్రయోజనాలు ఈ సర్కారుకు పట్టవా? అక్రమంగా నీటిని తరలించుకు పోతుంటే మొద్దు నిద్రలో ఉంటారా..? చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బిఆర్ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బిజెపి తీరు తెలంగాణ తాగు, సాగు నీటి రంగానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది. తెలంగాణ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ పడుతున్న ఆరాటం మీకు ఎలాగూ అర్థం కాదు, కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి! అని హరీశ్‌రావు సూచించారు.

# దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే డీలిమిటేషన్




ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ భాగస్వామిగా ఉందని తెలిపారు. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోందని వెల్లడించారు. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోందని తెలిపారు.

**ఆ రాష్ట్రాలకు మాత్రమే లబ్ధి :** కేంద్రం ఆదేశాల మేరకే తాము (దక్షిణాది రాష్ట్రాలు) కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మరో 30 సంవత్సరాలు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏ విధంగా పెరుగుతుందో చూడాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రో రేటా విధానంలో సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయని అభిప్రాయపడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని వెల్లడించారు. బిహార్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ధి జరుగుతుందని ఆయన అన్నారు.

# వరంగల్‌లో లక్షలమందితో బహిరంగ సభ



తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మొదటినుండి కాపాడుకుంటూ వస్తున్న బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణ సమాజానికి రక్షణ కవచం అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు. ఈ విషయం గత 14 నెలల కాంగ్రెస్ పాలన ద్వారా మరోసారి స్పష్టమైందని ఎర్రవెల్లి సమావేశంలో కేసీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మొదటినుండి కాపాడుకుంటూ వస్తున్న బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణ సమాజానికి రక్షణ కవచం అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు. ఈ విషయం గత పద్నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ద్వారా మరోసారి స్పష్టమైందని,, అందుకు తెలంగాణ సమాజంలో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి అనిశ్చితే నిదర్శనమని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 27 ఏప్రిల్ తేదీకి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో నిర్వహించే రజతోత్సవ వేడుకల్లో భాగంగా.. వరంగల్ జిల్లాలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈమేరకు వరంగల్ సమీపంలో విశాలమైన అనువైన ప్రదేశాలను పరిశీలించి త్వరలో సభా వేదిక స్థలాన్ని నిర్ణయించనున్నట్టు కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం నాడు జరిగిన కీలక సమావేశంలో ఇందుకు సంబంధించి సుధీర్ఘ చర్చ జరిగింది. ఈ సంధర్భంగా కేసీఆర్ గారు మాట్లాడుతూ.... దశాబ్దాల పాటు పోరాటాలు నడిపి ఎన్నో త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామని, అనంతరం పదేండ్ల పాటు ఎంతో అప్రమత్తతో తెలంగాణ స్వరాష్ట్రంలో పాలనను దేశానికే ఆదర్శంగా నిలుపుకున్నామని, అంతటి గొప్ప ప్రగతిని సాధించిన తెలంగాణ సమాజం ఇవ్వాల కష్టాల్లో వుందన్నారు. ఇటువంటి సందర్భంలో నిర్వహించుకుంటున్న రజతోత్సవ వేడుకలు, కేవలం బీఆర్ఎస్ పార్టీకే పరిమితం కాదని యావత్ తెలంగాణ సమాజానికి అందులో భాగస్వామ్యం వుందని స్పష్టం చేశారు. బీ ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలు నిర్మించుకున్న రాజకీయ అస్థిత్వ పార్టీ. ఇది తెలంగాణ ప్రజల పార్టీ... ప్రజలు బి ఆర్ ఎస్ ను తెలంగాణ పార్టీ గా తమ సొంత ఇంటి పార్టీ గా భావిస్తారు. ప్రజలు ఇవాళ అనేక కష్టాల్లో వున్నారు. వారి రక్షణ బి ఆర్ ఎస్ పార్టీనే అని నమ్ముతున్నారు." అని తెలిపారు. కాంగ్రెస్ ఆశపెట్టిన గ్యారెంటీలను వాగ్దానాలను నమ్మిన ప్రజలు ఇవాళ రాష్ట్ర ప్రభుత్వ నిజ స్వరూపాన్ని తెలుసుకున్నారని, ఇక ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బి ఆర్ ఎస్ కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ అన్నారు. వరంగల్ బహిరంగ సభ అనంతరం...పార్టీనీ గ్రామ స్థాయినుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా పటిష్ట పరిచి , ఆ దిశగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తర్వాత...నూతన కమిటీల బాధ్యులతో... ప్రతినిధుల సభను ఏర్పాటు చేయనున్నట్టు అధినేత తెలిపారు. కాగా....పార్టీలో యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలని నిర్ణయం తీసుకున్నారు.

# ఈపీఎఫ్ ఖాతాదారులకు గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

ఈపీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఇక నుంచి ఏటీఎం ద్వారా కూడా ఈపీఎఫ్ విత్ డ్రా చేసుకోవచ్చని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డా. మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. హైదరాబాద్ లో ఈపీఎఫ్ఓ కార్యాలయాలను మాండవీయ ప్రారంభించారు. ఈపీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఇక నుంచి ఏటీఎం ద్వారా కూడా ఈపీఎఫ్ విత్ డ్రా చేసుకోవచ్చని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డా. మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. హైదరాబాద్ బేగంపేటలోని బ్రాహ్మణాడిలో నూతనంగా నిర్మించిన ఈపీఎఫ్ఓ కార్యాలయ భవనం, తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం, బంజారాహిల్స్ రీజినల్ కార్యాలయ భవనాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి మాండవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాండవీయ మాట్లాడుతూ.. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ లావాదేవీలు ఇక 3.వెర్షన్‌లోకి మారనున్నాయన్నారు. బ్యాంక్ తరహాలోనే ఈపీఎఫ్ఓ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈపీఎఫ్ చందాదారులు ఏటీఎంల వద్దకు వెళ్లి తమ ఈపీఎఫ్ డబ్బును డ్రా చేసుకోవచ్చని కేంద్రమంత్రి తెలిపారు. చిన్న చిన్న సవరణలను ఆన్‌లైన్‌లోనే చేసుకునే వీలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సనత్ నగర్ ఈఎస్ఐసీ హాస్పిటల్, మెడికల్ కాలేజీ నెంబర్ 1గా నిలిచాయన్నారు. ఇందుకు మాండవీయకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో మరిన్ని ఆస్పత్రులు, వైద్య కళాశాలలు నిర్మించాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కిషన్ రెడ్డి తెలిపారు. రామగుండం వంటి చోట్ల స్థలం కేటాయిస్తే పనులు ప్రారంభిస్తామని కేంద్రమంత్రి చెప్పారు. సిద్దిపేటలోని




ఈపీఎఫ్ఓ కార్యాలయాన్ని వేరొక కార్యాలయంలో విలీనం చేస్తున్నారనే వదంతులు వస్తున్నాయి.. ఆ కార్యాలయాన్ని అక్కడే కొనసాగించేలా అనుమతించాలని కేంద్రమంత్రి మాండవీయను మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కోరారు. ఈ క్రమంలో స్పందించిన కేంద్రమంత్రి మాండవీయ.. ఆ కార్యాలయాన్ని సిద్దిపేటలోనే కొనసాగించాలని కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేశ్ కృష్ణమూర్తిని ఆదేశించారు. ఈ క్రమంలో కేంద్రమంత్రికి రఘునందన్ రావు ధన్యవాదాలు తెలిపారు.

# తమిళ భాషకు గుర్తింపు ఇస్తాం

మొదటిపేజీ తరువాయి

తమిళనాడులో హిందీ భాషా వివాదం దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. తమిళ భాషకు కేంద్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. భాషా విషయంలో స్టాలిన్ రాజకీయం చేయడం సరైంది కాదన్నారు. సీఎం స్టాలిన్, కేంద్ర మంత్రులు ఒకరినొకరు తీవ్రంగా విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవల స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు కేంద్రం హోం మంత్రి అమిత్ షా తాజాగా స్పందించారు. తమిళ భాషకు కేంద్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. భాషా విషయంలో స్టాలిన్ రాజకీయం చేయడం సరైంది కాదన్నారు. ఇక వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం అమిత్ షా రాణిపేటలో పర్యటించారు. సీఐఎస్ఎఫ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. " ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ఉన్నత విద్య కోసం తమిళ భాషలోనే సిలబస్‌ను తీసుకొస్తాం. ఇందుకోసం వెంటనే చర్యలు చేపడతాం. తమిళ భాష సంస్కృతికి, అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాం. దేశంలోని ప్రాంతీయ భాషలను మేము గౌరవిస్తాం. ఇప్పటిదాకా సీఏపీఎఫ్ నియామకంలో చూసుకుంటే మాతృభాషకు స్థానం లేదు. దూనివల్ల యువతకు నష్టం జరుగుతోందని ప్రధాని మోదీ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు. అన్ని భాషలతో పాటు తమిళ భాషలో కూడా సీఏపీఎఫ్ పరీక్షలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. స్టాలిన్ ఇకనుంచైనా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని" అమిత్ షా అన్నారు. ఇదిలాఉండగా.. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంపై స్టాలిన్ మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పటికీ గెలవలేని యుద్ధాన్ని




ప్రారంభించారని అన్నారు. "చెట్టు ప్రశాంతంగా ఉండాలని అనుకున్నప్పటికీ గాలి రాకుండా ఉండలేదు కదా. అలాగే భాష విషయంలో కూడా ఆయన మమ్మల్ని రెచ్చగొడుతున్నారు. ఇందుకోసమే మేము వరుసగా లేఖలు రాస్తున్నాం. జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరిస్తున్న తమిళనాడు.. ఇప్పటికే విద్యావిధానంలో అనేక లక్ష్యాలు సాధించింది. త్రిభాషా అశంలో ఎల్‌కేజీ విద్యార్థి పీహెచ్‌డీ హోల్డర్‌కి ఆయన ఉపన్యాసం ఇచ్చినట్లు ఉంది. దీనిపై బీజేపీ సర్కారు చేస్తున్న సంతకాల ప్రచారం హాస్యాస్పదంగా ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విషయాన్ని సవాలుగా తీసుకొని బరిలోకి దిగాలి. పథకాల దగ్గర నుంచి చూసుకుంటే కేంద్ర సంస్థలకు ఇచ్చే అవార్డుల వరకు అన్నింటికీ కూడా హిందీ పేర్లను పెట్టారని" సీఎం స్టాలిన్ అన్నారు.

# మీడియా ముందే బోరున ఏడ్చేసిన కెనాడా ప్రధాని ట్రూడో



మొదటిపేజీ తరువాయి

కెనాడా ప్రధాని జస్టిస్ ట్రూడో మీడియా ముందే ఏడ్చేశారు. ప్రధానిగా ఆయన పదవి మరో 3రోజులు మాత్రమే మిగిలి ఉంది. దీంతో కెనడా దేశ పరిస్థితులు, అమెరికా ఆ దేశంపై అవలంభిస్తున్న విధానాలు తలుచుకోని జస్టిస్ ట్రూడో భావోద్వేగానికి గురైయ్యాడు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలకు ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తత నెలకొంది. కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో పదవి కాలం మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉంది. దీంతో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో ట్రూడో ఎమోషనల్ అయ్యారు. మీడియా ముందు ఏడ్చుకుంటూ.. కెనడియన్ పౌరులకు ఐక్యంగా ఉండాలని ప్రజలకు ట్రూడో విజ్ఞప్తి చేశారు. కెనడా దేశ పరిస్థితులు, అమెరికా ఆ దేశంపై అవలంభిస్తున్న విధానాలు తలుచుకోని జస్టిస్ ట్రూడో భావోద్వేగానికి గురైయ్యాడు. ట్రంప్ సుంకాల కారణంగా కెనడాలో రాబోయే కాలం మరింత కష్టతరంగా మారుతుందని ట్రూడో ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ గురువారం కెనడియన్ ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధించిన విషయం తెలిసిందే. ప్రధానమంత్రిగా తాను ప్రతిరోజూ కెనడా పౌరుల మంచికే మొదటి ప్రాధాన్యత ఇచ్చానని ట్రూడో అన్నారు. కెనడా ప్రజలను ఆయన శ్రద్ధగా చూసుకున్నానని చెప్పారు. ఆయన పదవిలో ఉన్న చివరి రోజుల్లో కూడా కెనడా ప్రజల బాగోగుల గురించే ఆలోచించానని కంటతడి పెట్టుకుంటూ అన్నారు. ఇప్పుడే కాదు.. భవిష్యత్‌లో కూడా ఆయన కెనడా ప్రజల కోసమే నిర్ణయాలు తీసుకుంటానని వివరించారు. కెనడా ప్రజలు, పాలకుల మధ్య గెలుపోటములు ట్రంప్‌కు విజయాన్ని మాత్రమే తెచ్చిపెడుతుందని ఆయన అన్నారు. అంతర్జాతీయ వ్యాపారంలో కెనడా మీద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కక్ష్య పెంచుకున్నారని ఆయన అన్నారు. మార్చి 9తో జస్టిస్ ట్రూడో ప్రధాని పదవి బాధ్యతలు ముగియనున్నాయి. అదే రోజున అధికార లిబరల్ పార్టీ తన కొత్త నాయకుడిని ఎన్నుకుంటుంది.

# బీఆర్ఎస్ పార్టీనేతలతో కేసీఆర్ భేటీ

మొదటిపేజీ తరువాయి

చర్చ జరుగుతోంది. ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో పార్టీ ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం కొనసాగుతోంది. పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు తాజాగా ఎమ్మెల్సీకి సంబంధించి అభ్యర్థి ఎంపిక, ఏప్రిల్ 27న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావదినోత్సవం అలాగే బడ్జెట్ సమావేశాలపై కూడా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎమ్మెల్యేల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై సమావేశంలో చర్చకు వచ్చింది. రెండు స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టేలా కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారు. అలాగే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనక్కి రప్పించేలా కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కూడగట్టేలా బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈనెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపుగా మూడు గంటలకు సమావేశం కొనసాగుతోంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు పార్టీని సంస్థాగతంగా బలోపేతం దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. అలాగే బడ్జెట్ మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత బడ్జెట్ సమావేశంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో ఒక్క రోజు మాత్రమే కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యారు. అయితే మరోసారి బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో కేసీఆర్ హాజరవుతారా లేదా అంటూ తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు కేసీఆర్ అసెంబ్లీ వస్తారని తెలుస్తోంది. దీనిపై కూడా పార్టీ నేతలతో చర్చిస్తున్నట్లు సమాచారం. అలాగే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి ఏప్రిల్ 27 నాటికి 24 సంవత్సరాలు పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెట్టబోతోంది. దీంతో సిల్వర్‌జూబ్లీ పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ లేదా వరంగల్‌లో బహిరంగ నిర్వహించాలని కేసీఆర్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏప్రిల్ 10న బీఆర్ఎస్ ప్రతినిధుల సభ హైదరాబాద్ వేదికగా జరుగుతుందని గతంలో కేటీఆర్ ప్రకటించారు. దానిపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. గత పదేళ్లుగా పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ సంస్థాగతంగా అంత బలంగా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయడంతో






పాటు అనుబంధ విభాగాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్న కేసీఆర్ కొత్తగా కమిటీలు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి కేటీఆర్, హరీష్, కవిత, మధుసూదనాచారీ, జగదీష్ రెడ్డి, తలసాని, నిరంజన్ రెడ్డి, పద్మారావు గౌడ్, పువ్వాడ అజయ్, శ్రీనివాస్ గౌడ్, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శనివారం 08 - 03 - 2025

# బహిరంగ క్షమాపణ చెప్పాలి

**బీఆర్ఎస్ నాయకులపై విరుచుకుపడ్డ టోనీ**



**సిరిసిల్ల, తెలంగాణ సేన న్యూస్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులపై విరుచుకుపడుతూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ టోనీ. స్థానిక ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల తీరును తీవ్రంగా విమర్శించారు."మీరు చెప్పులతో కొట్టుడు కాదు... మాట తోలా చెప్పలు? మేము కొట్టామా? అవకాశం ఉంటే మిమ్మల్ని వందసార్లు కొట్టిన తప్పులేదు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు అండగా ఉండని తమను, ఇప్పుడు ధ్వజమెత్తుతామని అనుకోవడం తప్పని విమర్శించారు.కేకే మహేందర్ రెడ్డిను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులది కాదని, మహేందర్ రెడ్డి కి జరిగిన అన్యాయానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు సిగ్గుపడాలని అన్నారు. "కేకే గురించి మీ కేసీఆర్, కేటీఆర్‌ను అడుగు మీ ప్రభుత్వం దోపిడీలు, కమీషన్లతో నిండి ఉంది" అంటూ విమర్శల వర్షం కురిపించారు.కేటీఆర్‌పై తీవ్ర ఆరోపణలు కేటీఆర్ ఎనలేని సేవలు చేయలేదని, తెలంగాణ సంపదను దోచుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను "జై తెలంగాణ" అని నినదిస్తే, కేటీఆర్ మాత్రం "లాగులు వేసుకుని తిరుగుతున్నవని" విమర్శించారు."తెలంగాణ ప్రజలు మాకు బాసటగా ఉన్నారు మీరు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పండి" అంటూ సూటిగా ప్రశ్నించారు. "ప్రజల కోసం పనిచేసిన కేకే మహేందర్ రెడ్డికి రావాల్సిన టికెట్‌ను బీఆర్ఎస్ నాయకులు గద్దలా లాక్కున్నారు" అని విమర్శించారు.సామాజిక అన్యాయాలపై ప్రశ్నలు ఎల్లారెడ్డిపేట మండలంలో చిన్నారి పై జరిగిన అఘాయిత్యంపై బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. "చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారా కేటీఆర్?" అంటూ నిలదీశారు. "మీ ప్రభుత్వ పాలనలో రూ.3500 కోట్ల దోపిడీ జరిగింది. ఇందులో కేటీఆర్ వాటా ఎంత?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. నేరెళ్ల ఘటనలో దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినా బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు.బీఆర్ఎస్ నాయకులు కేకే మహేందర్ రెడ్డికి జరిగిన అన్యాయానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని టోనీ డిమాండ్ చేశారు. "గత అధికార మదాన్ని ఇప్పుడు చూపిస్తే ఊరుకోం" అంటూ గట్టి హెచ్చరిక చేశారు. ఈ సమావేశంలో నేరెళ్ల నరసింగం గౌడ్, మునిగెల రాజు, ఎట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పబ్బతి కృష్ణారెడ్డి రాము, పొన్నాల పరుశురాం, అరెపల్లి బాలు, తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్ధ సేవకు అంకితం

**శ్రీ భ్రమరాంబిక సేవా సమితి ఫౌండర్ శ్రీ మహాలక్ష్మి**



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** శ్రీ భ్రమరాంబికా సేవా సమితి మీ ముందున్న శ్రీ భ్రమరాంబికా సేవా సమితి, 2016లో నేను శ్రీశైలం అమ్మవారిని దర్శనం చేసుకోవడానికి వెళ్ళినప్పుడు నాకు కలిగిన ప్రకంపనల ఫలితమే.ఎటువంటి ముందస్తు ఆలోచనలు లేకుండా, నిస్వార్ధంగా మరియు నిస్వార్ధంగా సేవ చేయాలనే ఏకైక లక్ష్యంతో, మా సేవకులు అన్ని ప్రధాన దేవాలయాలలో మరియు గ్రామీణ దేవాలయాలలో సేవ చేయడానికి అవకాశాలను కల్పించాము. నేడు, 5 రాష్ట్రాలలో స్వచ్ఛందంగా సేవ చేస్తున్న దాదాపు 20,000 మంది సేవకులు ఉన్నారు, రోజువారీ సేవలు, హుండీ లెక్కింపు సేవలు, ఆలయ శుభ్రతా సేవలు, నామ సంకీర్తన సేవలు, భజనలు, కోలాటాలు మరియు చెక్క భజనలు చేస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు అనారోగ్యంతో ఉన్నవారికి మరియు అత్యవసర పరిస్థితుల్లో నిజంగా ఆర్థిక సహాయం అవసరమైన వారికి తక్షణ సహాయం అందిస్తున్నారు.దేవాలయాల సూచనల ప్రకారం, సమితి 2020లో నమోదు చేయబడింది మరియు భక్తులకు నిజాయితీగా, నైతికంగా మరియు మానవ సేవగా, మాధవ సేవగా, భక్తి మరియు భక్తితో సేవ చేస్తోంది. మేము ముందుకు సాగుతున్నాము.కరోనా కాలంలో, పాదచారులకు ఆహారాన్ని ఏర్పాటు చేయడం ద్వారా మేము అనేక కుటుంబాలకు మద్దతు ఇస్తున్నాము. దాతల సహాయంతో దేవాలయాలలో భక్తులకు వేడి నీటి డిస్పెన్సర్లను అందించాము. ప్రతి ఆలయంలో గోశాలలకు అవసరమైన వస్తువులు, ఆహారం, మందులు మరియు గరక స్తంభాలను కూడా అందరి సహాయంతో అందిస్తున్నాము. ప్రతి సంవత్సరం, మహాశివరాత్రికి వారం లేదా పది రోజుల ముందు, శ్రీశైలంలో, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పట్టు వస్త్రాలు, వివిధ రకాల అలంకరణ వస్తువులు, చీరలను ఘనంగా సమర్పిస్తారు.భక్తుల కోసం లక్షల చదరపు మీటర్ల నైవేద్యాలు, కూరగాయలు మరియు ధాన్యాలను అందిస్తున్నాము.అలాగే, మహాశివరాత్రి తర్వాత, మేము శ్రీకాళహస్తిలో చీరలను అందిస్తున్నాము. ఈ ప్రక్రియలో, సేవకులు మరియు దేవాలయాలలో అనేక మార్పులను మనం చూస్తున్నాము... మంచి విషయాలతో పాటు, ప్రతిరోజూ మన ముందు జరుగుతున్న వివిధ విషయాలను నేను ప్రస్తావించాలనుకుంటున్నాను.చాలా మంది ఆధ్యాత్మిక రంగాన్ని వ్యాపార కోణం నుండి చూస్తారు. వారు దానిని వ్యాపారంగా మార్చడమే కాకుండా దానిని భ్రష్టుపట్టిస్తున్నారు. దర్శనాల ముసుగులో సేవల కోసం మాత్రమే వస్తున్నారు.. అదేవిధంగా, చాలా మంది మా చేరి శిక్షణ పూర్తి చేయకుండానే గ్రూపులుగా ఏర్పడి పక్కదారి పడుతున్నారు. వారు పడిపోతున్నప్పటికీ, చాలా మోసపోయిన మరియు వారి స్వార్ధ ప్రయోజనాలతో వెళ్లిపోయిన వారు ఉన్నారు... ఆధ్యాత్మిక రంగంలో మోసం మరియు ద్వేషం ఉండకూడదు అని చెప్పవచ్చు.. డబ్బుతో సేవలను కొనకండి. మూడవ కన్ను ఎల్లప్పుడూ మనల్ని గమనిస్తూ ఉంటుంది. మన అంతరంగానికి మనం సమాధానం చెప్పాలి. సమాజంలో మనం ఒక ఉదాహరణగా ఉండాలి.అదేవిధంగా, దేవాలయాలు ఆధ్యాత్మికత, సంప్రదాయాలు మరియు ఆచారాలకు నిలయాలుగా ఉండాలి.. మంచి సేవకులను మరియు సేవా సంస్థలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి స్వచ్ఛందంగా భక్తులకు మెరుగైన సేవలను అందించాల్సిన అవసరం చాలా ఉంది.. ఈ విధంగా, హిందూ ధర్మం రక్షించబడుతుంది. దాతలు ముందుకు వస్తారు.. విరాళాలకు విలువ ఉంటుంది. మన సంస్కృతిని మనం కాపాడుకోగలుగుతాము.దీని కోసం, దేవాదాయ శాఖను ప్రభుత్వ రంగం నుండి మినహాయించాలని, భక్తులను దేవునికి దగ్గరగా ఉంచాలని మరియు దేవాలయాలను వాణిజ్య రంగం నుండి దూరంగా ఉంచాలని నేను అభిప్రాయపడుతున్నాను.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు సాధించిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ విజయాలను గుర్తించి, జరుపుకునే రోజు ఇది.భారత రాజ్యాంగం పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఈ వ్యవస్థ పౌరులకు ఎన్నుకోబడే హక్కు, వాక్ స్వతంత్రం , సమావేశాలు, సంఘాలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ, ఓటు హక్కుకు హామీ ఇస్తుంది. భారత రాజ్యాంగం లింగం, వర్గం ఆధారంగా వివక్షను నిషేధించడం, మానవ అక్రమ రవాణా, బలవంతపు పనిని నిషేధించడం, ఎన్నికైన స్థానాలను మహిళలకు కేటాయించడం (రిజర్వ్) చేయడం ద్వారా లింగ అసమానతలను తొలగించడానికి ప్రయత్నిస్తుంది.సమాన వేతనం, ఉచిత న్యాయ సహాయం, మానవ పని పరిస్థితులు మెరుగు పరచడం, ప్రసూతికి ఉపశమనం, పని, విద్యా హక్కులు, జీవన ప్రమాణాలను పెంచడం వంటి చర్యల ద్వారా వర్గం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలని భారత ప్రభుత్వం రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే చారిత్రాత్మకంగా మహిళల రాజకీయ భాగస్వామ్యం తక్కువగానే ఉంది.పార్టీలపరంగా చూస్తే గ్రామ స్థాయి అధ్యక్షత నుండి రాష్ట్ర స్థాయి అధ్యక్షత వరకు మహిళలకు అధికారం ఇవ్వడం తక్కువనే చెప్పాలి. కేవలం గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మహిళలను మహిళా శాఖ అధ్యక్షత మాత్రమే అప్పుజెప్పడం ఒకరకంగా వివక్షత అనే చెప్పాలి. ఎందుకంటే మహిళలను మహిళల వరకు మాత్రమే అధ్యక్షునిగా చిత్రీకరించడం నిజంగా బాధాకరం. ఎందుకు పురుషులకు కూడా ఆమె అధ్యక్షత వహించకూడదు అనేది మనం ఆలోచన చేయాలి.ఇక రాజకీయంగా పోటీ విషయంలో వచ్చేసరికి జనరల్ స్థానం వచ్చినచోట మహిళలను పోటీ చేయించడం తక్కువనే చెప్పాలి. అంతేకాకుండా వార్డు మెంబర్ నుండి జిల్లా ప్రజా పరిషత్ వరకు మహిళా రిజర్వేషన్లు వస్తేనే వారికి అవకాశాలు ఇస్తారు. ఒకవేళ మహిళా రిజర్వేషన్లలో వారు గెలిచినప్పటికీ ఆ పదవి మీద సర్వాధికారాలు పురుషులు తీసుకోవడం అత్యంత బాధాకరం. కేవలం వారికి కేటాయించిన సీట్లలో కూర్చోబెట్టడమే కాదు వారికి వాక్ స్వాతంత్రం ఇచ్చి నిర్ణయాధికారం ఇచ్చినప్పుడే మహిళా సాధికారత సాధించినట్లు అవుతుంది. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టి మహిళలు గెలిచిన చోట పురుషాధిక్యతను లేకుండా చేయాలని కోరుకుంటున్నాను.మహిళలను మహిళా దినోత్సవ నాడే మంచి సత్కారాలు చేసి మిగిలిన రోజులలో వివక్షతకు గురి చేయడం ఎంతవరకు సమంజసం మనం ఆలోచన చేయాలి.ఇంట్లో,బయట,సమాజంలో సామాజిక ,ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ, ఉద్యోగాల్లో మహిళా సాధికారత సాధించనంత కాలం ఎన్ని మహిళా దినోత్సవాలు చేసిన లాభంలేదు. ఒకవైపు లైంగిక వేధింపులతో బాధపడు బ్రతుకునీడ్చేటి అతివలు ఎందరినో మనం చూడవచ్చు. కొందరు ముందడుగు వేసి లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నప్పటికీ ఒక వైపు చిన్న చూపు చూడడం పరపాటిగా మారింది. బయటికి చెప్పుకున్నా.... ఒక బాధ ,చెప్పుకోకుంటే మరో బాధ. ఇలా ఎన్నో బాధల బాణాలు వారి ఎదుగుదలను గుచ్చి తెంపేస్తున్నాయి.ఇవన్నీ ఒకవైపు అయితే ముఖ్యంగా స్త్రీ హక్కుల కోసం పోరాటం చేసిన వ్యక్తులలో అతి ముఖ్యమైన వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. అగ్రకులాలలో పుట్టిన స్త్రీలు కూడా ఈ నాటికి విద్య,వైద్య, ఉపాధి లో పురుషులతో పాటుగా సమాన హక్కులు పొందుతున్నారంటే కారణం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.అత్యంత జనాభా కలిగిన భారతదేశంలో 50% కు పైగా ఉన్న స్త్రీ జనోద్ధరణకు నడుం బిగించి మాతృస్వామ్య పరిపాలన కోసం కలలు కన్నా బాబాసాహెబ్ అంబేద్కర్ న్యాయశాఖ మంత్రి హోదాలో హిందూకోడ్ బిల్లును రూపొందించడం జరిగింది. కులాలుగా విడిపోయి ఉన్న దేశంలో స్త్రీలందరి సాధికారత కోసం ఈ బిల్లు ఉద్దేశించబడింది. విద్యా ,వివాహం,ఆస్తి హక్కులతో పాటు ఆత్మ రక్షణ, ఆత్మగౌరవం కోసం నిర్దేశింపబడిన ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదించేందుకు ముందుగా అంగీకరించిన అప్పటి ప్రధానమంత్రి నెహ్రూ మనువాదులతో తనకున్న లోపాయికారి ఒప్పందంతో బిల్లు వీగిపోయేటట్లు కృషి చేశాడు. బ్రాహ్మణ్యంతో వేళ్ళూనుకుని ఉన్న సమాజంలో స్త్రీని స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో పరిపూర్ణ మహిళగా మార్చాలను కోవడమే హిందూ కోడ్ బిల్లు వీగిపోవడానికి కారణం. ఈ సంఘటన సరిగ్గా పూణే ఒడంబడిక జరిగిన 20 సంవత్సరాల అనంతరం అంటే 1952 లో జరిగింది. మాటతప్పిన నెహ్రూ మోసకారితనంతో వ్యాకులత చెందిన %ణతీ దీ =% అంబేద్కర్ తన పదవిని తృణపాయంగా వదిలేసి, రాజీనామా ద్వారా యావత్ భారతదేశానికి నిరసన తెలియజేశాడు.

ఏదేమైనాప్పటికీ నాటి నుండి నేటి వరకు
అవమానాలను తట్టుకుంటావు
అనుమానాలను ఎదిరిస్తావు.
అవకాశాలను వదులుకుంటావు
అన్యోన్యంగా అందరితో ఉండిపోతావు
అలసట లేకుండా పనిచేస్తావు
అన్నం తినకుండా పిల్లలకు పెడతావు
ఆప్యాయతలను పంచుకుంటావు
ఆలోచనలతోనే అర్ధజీవితకాలం గడుపుతావు
ఓ మహిళా..మీకు వందనం
మీరు లేనిదే సాగదు... మా పయనం
మీ రక్షణనే కోరుకునేది మా నయనం
ఈ సృష్టికే మూలాధారం మీ జీవనం
అందుకోండి మా వందనాలు.....అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

# కాలం చెల్లిన వాహన స్క్రాపింగ్ చట్టం కఠిన తరం

**రాష్ట్రంలో... రెండో స్క్రాపింగ్ కేంద్రం ప్రారంభం**

**భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణం అందిద్దాం**

**ట్రాన్స్ పోర్ట్ జిల్లా అధికారి కొండలరావు**




**తెలంగాణ సేన న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాతావరణ సమతుల్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ చర్యలు తీసుకుంటుండగా, కాలం చెల్లిన వాహన స్క్రాపింగ్ చట్టాన్ని కఠిన తరం చేస్తున్నట్లు రవాణ జిల్లా అధికారి కొండలరావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం చందాపూర్ శివారులో అంబర్ ఎంటర్ ప్రైజస్ పేరిట రెండవ స్క్రాపింగ్ కేంద్రం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించే క్రమంలో కాలం చెల్లిన వాహనాల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పాత వాహనాలు తొలగింపుతో రహదారుల భద్రత మెరుగుపర్చి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని అన్నారు. అయితే కాలం చెల్లిన వాహనాల తొలగింపులో ప్రభుత్వం వివిధ రకాల రాయితీలు కల్పిస్తుండగా, కొత్త వాహనాలను ప్రోత్సహించినట్లు అవుతుందని తెలిపారు. కాగా ద్విచక్ర, త్రిచక్ర, ఫోర్ వీలర్, భారీ వాణిజ్య వాహనాలను అధికృత ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం ద్వారా ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించి చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా కాలుష్య నియంత్రణ బోర్డు ఆమోదంతో స్క్రాపింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తుండగా, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పునరుద్ధరించని, ఫిట్నెస్ మంజూరి కానీ, వివిధ సందర్భాలలో దెబ్బతిన్న, గడువు ముగిసిన వాహనాలను స్క్రాపింగ్ కేంద్రాలకు పంపిస్తామని, ఇందుకు వాహనదారులు సహకరించాలని కోరారు. ఇప్పటికే ఢిల్లీ వంటి ప్రముఖ ప్రాంతాలలో కాలుష్యం మితిమీరి అడుగు పెట్టలేక పోతుండగా, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు 15 ఏళ్లు ముగిసిన, కాలం చెల్లిన వాహనాలను స్క్రాపింగ్ కేంద్రాలలో అప్పగించి సహకరించాలని చెప్పారు. ఆయితే వాహనాల తొలగింపు బహుముఖ ప్రయోజనాలతో చక్కటి ఫలితాలు సాధిస్తుందని, వాతావరణాన్ని సంరక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. వాతావరణంలో సమతుల్యత లోపించి వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉండగా, నగరాలకు పరిమితమైన పొల్యూషన్ సమస్య గ్రామాలకు సైతం విస్తరించడం దురదృష్టకరమని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రిస్టోఫర్, ఏసిపి వెంకట్ రెడ్డి, సంస్థ డైరెక్టర్లు గిరీష్ కుమార్, ఉమామహేశ్వర్ రెడ్డి, హరి గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ జీవి. చంద్రకిరణ్ మెమోరియల్ హాల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం



**అల్వాల్, తెలంగాణ సేన న్యూస్, మార్చి 7 :** అల్వాల్, యాదమ్మ నగర్, గద్దర్ బస్తీలోని డాక్టర్ జీవి. చంద్రకిరణ్ మెమోరియల్ హాల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రిత కమ్యూనిటీ కేర్, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసేర్చ్ సెంటర్, రెయిన్ బో హోమ్స్ ప్రోగ్రాం ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని రెయిన్ బో ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, జాతీయ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్, గద్దర్ అన్న గారి విగ్రహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. పేద ప్రజలు నివసిస్తున్న బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆమె



సూచించారు. ఈ శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి నుండి వచ్చిన జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ వైద్యులు 180 మందికి బిపి, షుగర్ పరీక్షించి, వైద్య సలహాలు, మందులను ఉచితంగా అందజేశారు. మోకాలు, నడుము నొప్పి ఉన్నవారికి ఫీజియోతెరపిస్ట్ శ్రీనివాస్ ఎక్సర్సైజ్ లను చూపించారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్న వారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ఈ శిబిరంలో ఆశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజ, రెయిన్ బో ఫౌండేషన్ సిబిసి సిటీ డెస్క్ మేనేజర్ క్రాంతి కిరణ్, ఆశ్రిత సిబిసి కో ఆర్డినేటర్ పర్వతాలు, శేఖర్, రామకృష్ణ, నగ్మా, శివమ్మ, కిమ్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ విక్రం, జనహిత సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ నర్సింగ్ రావు, స్థానిక నాయకులు ఆర్.మధు, బి.స్వామి, బాలపీరు, వెంకటస్వామి, వడ్డేమాను రాము తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు వినతిపత్రం అందజేసిన ప్రముఖ సామాజికవేత్త తేలుకుంట సతీష్ గుప్తా



**కంటోన్మెంట్ ,తెలంగాణ సేన న్యూస్ :** కంటోన్మెంట్ ఐదవ వార్డ్ లోని బస్తీ, కాలనీలలో గత నెల రోజులుగా మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో, ఐదు రోజులకు ఒకసారి సరఫరా కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని ప్రముఖ సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్తా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు వివరించడంతో పాటు వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన శ్రీ గణేష్ కంటోన్మెంట్ బోర్డు నీటి విభాగం ఇంజనీర్ శశాంక్ గారితో మాట్లాడి.. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. త్వరలో వాల్వ్ మరమత్తు చేయించడం జరుగుతుంది అని ఇంజనీర్ శశాంక్ తెలపడం జరిగింది. కొన్ని బస్తీల్లో పబ్లిక్ బోర్ వెల్ ఎండిపోవడంతో బస్తీ వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని అందువల్ల గాంధీ నగర్ బస్తీ, కాకగూడ బస్తీ మరియు సంజీవయ్యా నగర్ బస్తీ లలో కొత్త బోర్ వెల్ వేయించాలని శ్రీ గణేష్ ని సతీష్ గుప్తా కోరారు. త్వరలో నీటి సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



**బన్సీలాల్ పేట్, తెలంగాణ సేన న్యూస్, మార్చి 7 :** సికింద్రాబాద్, బోయిగూడా లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు వర్కింగ్ ఉమెన్స్ కోఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ ఎం పద్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం సమాజంలో అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. ఎంత ఉన్నతమైన పదవులు చేపట్టినా, మహిళల పట్ల వివక్ష ఉన్నదని, దానిని అణచివేయాలని ఆమె సూచించారు. ఇంటా, బయట పనిచేస్తున్న మహిళలు తీవ్రంగా పని ఒత్తిడికి గురవుతున్నారని, ఆరోగ్యం బాగుంటేనే కుటుంబానికి సేవలు అందించగలరని ఆమె అన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సికింద్రాబాద్ ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రేణుకా దేవి, ప్రొఫెసర్ రోజారాణి, సహాయ ప్రొఫెసర్ సత్యప్రియ, ఇతర అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ బోయిగూడలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

## ప్రభుత్వ అధికార్లు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు శంకుస్థాపన ఏంటి

**డా : జాడి రామరాజు నేత**



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** ములుగు జిల్లా కేంద్రం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి డా జాడి రామరాజు నేత మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేస్తున్నా నాయకులు ఇల్లు నిర్మించుకునే వాళ్లకు డబ్బులు ఇస్తారా, లేక ప్రభుత్వం ఇస్తున్నదా, లేక కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు ఇస్తారా లేక పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళ శిశు సంక్షమా శాఖమంత్రి డబ్బులు ఇస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. మంత్రి అనుచర్లు, ప్రభుత్వ అధికార్లు లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేస్తున్నారు. కాబట్టి దళిత బహుజన మైనార్టీ వర్గాల ప్రజలకు చెప్పాలని అన్నారు. అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి ఆదేశాల మేరకు పైడకుల అశోక్ ఆదేశాల మేరకు శంకుస్థాపన స్థాపన చెయ్యడానికి మంత్రి ఏమైనా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినా పైడకుల అశోక్ ఏమైనా జిల్లా కలెక్టరా ఆదేశాలు ఇవ్వడానికి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చెయ్యడానికన్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతం లోని ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజలను నమ్మించి స్థానిక ఎన్నికల్లో లబ్ది పొందడం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను మరోసారి మోసం చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. అదేవిదంగా మన ప్రాంతం అభివృద్ధి కావాలంటే పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన సర్పంచ్ ఎంపీటీసీ జడ్పీటీసీ అభ్యర్థులను గెల్పించాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత అన్నారు.

## అవాయి ఆల్కలిన్ ప్యూరి ఫైర్ వాటర్ పై అవగాహన సదస్సు

**ఆరోగ్యమే మహాభాగ్యం - రాగుల నాగరాజు**





**తెలంగాణ సేన న్యూస్ :** ఆరోగ్యమే మహాభాగ్యం అని అవాయ్ ఆల్కలిన్ ప్యూరి ఫైర్ వాటర్ తాగండి ఆరోగ్యంగా జీవించండి అని రాగుల నాగరాజు అన్నారు శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో అవాయ్ ఆల్కలిన్ ప్యూరి ఫైర్ వాటర్ ఫిల్టర్ పై అవగాహన సదస్సు కంపెనీ ఎండి రాగుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సందర్భంగా అవాయ్ ఆల్కలిన్ ప్యూరి ఫైర్ వాటర్ వినియోగిస్తున్న వారికి అభినందనలు తెలుపుతూ మన ఆరోగ్యం మన చేతుల్లో అని మంచినీటిని సేవిస్తే మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అవాయి ఆల్కలీన్ ప్యూరి ఫైర్ వాటర్ తో మనకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఒక గొప్ప మార్కెటింగ్ అవకాశం తో అవాయ్ ఆల్కలిన్ ప్యూరి ఫైర్ వాటర్ ఫిల్టర్ మన ముందుకు వచ్చిందని, తక్కువ ధరతో ఎక్కువ మన్నికతో, ప్రజల ఆదరణ పొందుతూ ఉన్నదని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆర్థికంగా ముందుకు సాగాలని కోరారు, అనంతరం అవాయి ప్యూరి ఫైర్ వాటర్ ఫిల్టర్ అత్యధికంగా సేల్ చేసిన వారికి చిరు సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో అవాయి ఆల్కలిన్ ప్యూరి ఫైర్ వాటర్ ఫిల్టర్ యాజమాన్యం,సిబ్బంది,పెద్ద ఎత్తున వినియోగదారులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ




**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పార పంపిణీ శుక్రవారం 248 రోజుకు చేరుకుంది, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్ నీరజ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అల్పాహారంతో పాటు అరటి పండ్లు , బ్రెడ్ పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి , తాజా మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజారామ్, మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ప్రభుత్వ దవాఖాన వద్ద అల్పాహారం పంపిణీ చేయడం అభినందనీయమని, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ పెళ్లిరోజు సందర్భంగా వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు,ఈ కార్యక్రమంలో లయన్ పరమేశ్వర చారి, లయన్ నేతి శ్రీనివాస్, లయన్ గుడాల రాధాకృష్ణ, లయన్ సంజయ్ గుప్తా, దొంతుల సత్యనారాయణ, డాక్టర్ నరసింహులు డాక్టర్ కుమారస్వామి, లయన్ మల్లేశం గౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సృష్టికి మూలం స్త్రీ



**మహబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన :** సృష్టికి మూలం స్త్రీ అని, ఎక్కడైతే మహిళలు గౌరవింపబడతారో అక్కడే దేవతలు పూజలు అందుకుంటారని మహబుబాబాద్ కేంద్రీయ విద్యాలయం ఇన్చార్జి ప్రిన్సిపల్ ముఖేష్ కుమార్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి అధ్యక్షత వహిస్తూ అన్నారు.మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉండగా రెండో శనివారం కావడంతో శుక్రవారం నిర్వహించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ వివిధ రూపాలలో ఉంటూ, కుటుంబ బాధ్యతే కాకుండా, సమాజం పట్ల కూడా ఎంతో బాధ్యతగా ఉంటూ, నేడు విద్యావంతులై పురుషులతో పాటు సమానంగా అన్ని అవకాశాలల్లో పోటీ పడుతున్నారని అన్నారు. స్త్రీలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అయినప్పటికీ కూడా ఇంకా వివక్షత అక్కడక్కడ కనిపించడం విచారకరమని అన్నారు. మానవతా విలువలు అలవర్చుకోని, వాటిని ఆచరించినప్పుడే స్త్రీలపై జరుగుతున్న వివిధ రకాల అఘాయిత్యాలు నివారించవచ్చునని తెలిపినారు. స్త్రీలకు ఉన్నటువంటి చట్టాల పైన ఇంకా లోతైన అవగాహన కల్పించవలసినటువంటి అవసరం ఉన్నదని తెలిపినారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు మరియు ఇతర సిబ్బందికి మెమొంటోలను అందించి సత్కరించినారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ నాయకులు మల్లేశం యాదవ్ జన్మదిన వేడుకలు



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దామనమైన మల్లేశం జన్మదినం సందర్భంగా శుక్రవారం గ్రామ యువత మరియు అభిమానుల ఆధ్వర్యంలో దామనమైన మల్లేశం జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించి వారి అపురూపమైన చిత్రపటం వారికి బహుకరించారు ఈ సందర్భంగా దామనమైన మల్లేశం యాదవ్ అభిమానులు మాట్లాడుతూ అన్నా అంటే నేను ఉన్న అంటూ గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటూ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న మల్లేశం యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిషత్తు లో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకోవడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో ఏగొండ స్వామి, సురేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, శివకుమార్, రజనీకాంత్, కిషన్, స్వామి, నర్సింలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి ఆలయం పునర్ నిర్మాణం కోసం భారీ విరాళాలు అందజేత



**మహబుబాబాద్ తెలంగాణ సేన :** చిన్నగుడురు మండల కేంద్రంలో యాదవుల కులా ఆరాధ దైవం బారి వరదలు వచ్చి గంగమ్మ తల్లి ఆలయం కోట్టుక పోవడం జరిగింది గంగమ్మ తల్లి ఆలయం పునర్ నిర్మాణం కోరకు చిన్నగుడురు గ్రామానికి చెందిన యాదవ్ సంఘం నాయకులు కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరణలో భాగంగా శుక్రవారం రోజున మండలం లో యాదవ్ సంఘం నాయకులు విరాళాలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ కారులు చిత్తారి,సోమన్న, శంకరయ్య రవి ,దోమల యాకూబ్, కోమ్ము మల్లయ్య, క్రిష్ణ, బోల్లు వెంకన్న, యాకన్న ,విరన్న, వెంకన్న ,నర్సయ్య ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పలువివాహాలకు హాజరు



**తెలంగాణా సేన న్యూస్ వరంగల్ :** నల్లబెల్లి మండలం పంతులుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏడాకుల స్వరూప - రాజిరెడ్డి గారి దంపతుల కుమారుడు శ్రీకాంత్ రెడ్డి - శృతి రెడ్డీ గార్ల వివాహం ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో జరగగా వారి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండల పార్టీ అధ్యక్షుడు, మండల నాయకులు, క్లస్టర్ బాధ్యులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** ఆదివారం రోజున ఉదయం 10:00 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం రోజున సమావేశం నిర్వహించబడును. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ , గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ దనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ విచ్చేస్తున్నారు. కావున ములుగు జిల్లాలోని అన్ని మండలాల నాయకులు, నాయకురాల్లు, మహిళా నాయకులు, మహిళా సోదరీమణులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు అందరూ పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.

## ఎస్ ఎం బాక్స్ క్రికెట్ ను సందర్శించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఇటీవలే నూతనంగా ప్రారంభమైన ఎస్ ఎం బాక్స్ క్రికెట్ ను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు శుక్రవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి దేశానికి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని అన్నారు. ఇలాంటి బాక్స్ క్రికెట్ ద్వారా యువత క్రికెట్లో మెలకువలు నేర్చుకోవడానికి అనువుగా ఉంటుందని అన్నారు. ఇలాంటి బాక్స్ క్రికెట్ ను గజ్వేల్ పట్టణంలో యువతకు అందుబాటులోకి తెచ్చిన యజమానుల ప్రయత్నం అభినందనీయమని అన్నారు.

## మిలియన్ మార్చ్‌డేను జయప్రదం చేద్దాం

**టి యూ జే ఏ సి సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి**

**ఉస్మానియా యూనివర్సిటీ, తార్నాక**



**తెలంగాణ సేన న్యూస్ :** గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే ను జయప్రదం చేయాలని టి యు జేఏసి సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి అన్నారు. దీనికి సంబంధించిన కరపత్రం ను ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ 2011 మార్చి 10 న సీమాంధ్ర దోపిడీ పాలన పై తెలంగాణ ప్రజలు తిరుగుబాటు జెండా ఎత్తిన రోజని, తెలంగాణ ప్రజలు తెగించి తెగువతో పోరాడారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ అకాంక్షలను, ఉద్యమకారుల గోడును మాజీ సీఎం కెసిఆర్ విస్మరించి తెలంగాణను విధ్వంసం చేశాడని మండి పడ్డారు. టియుజేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 250 గజాల ఇంటి స్థలం, రూ.30,000 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమకారుల వేదిక అధ్యక్షులు కంచర్ల భద్రి, ఎస్ ఎఫ్ ఐ అధ్యక్షులు మూర్తి, జార్జి రెడ్డి పిడిఎస్ యు అధ్యక్షులు ఎస్ నాగేశ్వర్ రావ్, సుమంత్, క్రాంతి, ప్రవీణ్, శివ, పత్తి పాటి లక్ష్మి కాంతం, చంద్రన్న ప్రసాద్, వి. యాదగిరి, డోలక్ యాదగిరి, స్వరూప, సుజ్జి, కె రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే జాతీయ లోక్ అదాలత్

**జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయండి**

**రవీంద్రశర్మ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి.**

**సురేష్ సెక్రెటరీ జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మహబూబాబాద్.**

**మహబూబాబాద్, టౌన్ తెలంగాణ సేన మార్చి :** దేశవ్యాప్తంగా పెద్దఎత్తున జరిగే జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా, శనివారం అనగా తేది:08-03-2025 రోజున మహబూబాబాద్ జిల్లాకోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అదేశాలమేరకు సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాసేవాధికార సంస్థకు సెక్రటరీ అయిన సురేష్ మహబూబాబాద్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు మరియు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో వేల సంఖ్యలో కేసులు పెండింగ్ లో ఉన్నాయని అన్ని కేసులను సాధారణ పద్ధతిలో పరిష్కరించడం సాధ్యంకాదని, అందుకనే జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకుని రాజీపడగలిగే క్రిమినల్, సివిల్ భూ తగాదా, మోటార్ వాహన ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ (దొంగతనాలు), ట్రాఫిక్, ఈ చలాన్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కక్షిదారులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టుల్లో తెలియజేసి రాజీ కుదుర్చుకుని కుటుంబసభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, మహబూబాబాద్ సబ్ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు, జిల్లా కోర్టు పరిపాలనాధికారి క్రాంతి కుమార్, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్లు దేవేందర్, సర్వయ్య, రాజేష్, రవి కుమార్ మరియు కోర్ట్ కానిస్టేబుల్స్ హాజరయ్యారు.

# మీరు తీసుకున్న తీర్మానాలు ఎంతవరకు ఫాలో అయ్యారు ఈ ఏడాది మాత్రం ఈ మిస్టేక్స్ వద్దు



స్మోకింగ్‌కు దూరం, మందుకు రామ్‌రామ్, వాకింగ్‌కు జై, డైటింగ్‌కు సై.. పక్షం రోజుల క్రితం పార్టీ చేసుకుంటూ తీసుకున్న తీర్మానాల సంగతేమిటి? ఓ అంచనా ప్రకారం.. ఇరవై ఐదు శాతం మంది జనవరి చివరి వరకు మాత్రమే కొత్త సంవత్సర తీర్మానానికి కట్టుబడి ఉంటారు. తొలివారంలోనే చేతులెత్తేసేవారు నలభై ఎనిమిది శాతం. ఒక్కోనెల గడిచేకొద్దీ.. ఎంతో కొంతమంది అస్త్ర సన్యాసం చేస్తారు. డిసెంబరు-2023 వరకూ అంతే ఉత్సాహంగా, అదే పట్టుదలతో కట్టుబడి ఉండేవారు ఎనిమిది శాతమే. ఆ కొద్దిమందిలో మీరూ ఉండాలనుకుంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. పెద్ద లక్ష్యాలను చిన్నగా విభజించుకోండి. ఏడాదిలో పది కేజీల బరువు తగ్గాలన్న తీర్మానం మంచిదే. కానీ, దాన్ని పది ముక్కలు చేసుకుని.. నెలకు ఒక కేజీ తగ్గినా చాలని అనుకుంటే.. తేలిక అవుతుంది. ఒక నెల కుదరకపోయినా, ఇంకోనెల సాధిస్తాం. ఏడాది చివరికి ఏడెనిమిది కిలోలు వదిలించుకోవడం ఖాయం. కోటీశ్వరుడు కావాలనే కోరిక కాదనలేనిదే. కానీ, వంద లక్షలు పోగైతేనే కోటి అవుతుంది. కాబట్టి, నెలనెలా ఎంత పొదుపు-మదుపు చేయాలనే విషయంలో స్పష్టత పెంచుకోండి. గాలిమేడలు వద్దు. సిగరెట్ మానేయాలన్న నిర్ణయానికి అభినందనలు. ఆ ప్రయత్నంలో చిన్నచిన్న వైఫల్యాలు ఎదురైనా పట్టించుకోకండి. ఉదాహరణకు కొంతమంది.. స్నేహితుల బలవంతంతోనో, వ్యసనం తాలూకు బలహీనత కారణంగానో.. సిగరెట్ ముట్టిస్తారు. ఎలాగూ మళ్లీ మొదలుపెట్టాం కదా అని.. పాత అలవాటే కొనసాగిస్తారు. ఇది తప్పు. ఆ అనుభవాన్ని పాఠంలా మాత్రమే తీసుకోవాలి. పట్టుదలతో ముందుకెళ్లాలి. మనసు చాలా శక్తిమంతమైంది. ఆ శక్తిని పాజిటివ్ ఎనర్జీగా మార్చుకోండి. మీ సంకల్పబలాన్ని పెంచుకోండి. ఆ ప్రయత్నంలో ధ్యానం ఎంతో ఉపయోగపడుతుంది. రోజూ ఓ పది నిమిషాలు మీ ఆలోచనలను గమనిస్తూ కూర్చోవడమే ధ్యానం. దీనివల్ల మీరు వేరు, మీ ఆలోచనలు వేరు అన్న ఎరుక సాధ్యం అవుతుంది. తీర్మానానికి కట్టుబడి ఉండాలన్న పట్టుదల పెరుగుతుంది. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలనుకోవడం మంచి తీర్మానమే. అంతలోనే, 'నాకు సమయం లేదు', 'పుస్తకం చదివితే కంటికి శ్రమ', 'పుస్తకాల రేట్లు బాగా పెరిగిపోయాయి', 'అయినా చదవదగిన పుస్తకాలు ఎక్కడొస్తున్నాయి?'.. తరహా సాకులతో ఓ మంచి అలవాటును మూలనపడేయకండి. ఏ వాకింగ్‌లోనో ఆడియో బుక్స్ వినండి. ధర ఎక్కువనిపిస్తే సెకండ్స్‌లో ప్రయత్నించండి. కొత్త పుస్తకాలలో సరుకు లేదనిపిస్తే.. క్లాసిక్స్ ఎంచుకోండి. మనసుంటే మార్గం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఎవరో ఒకరి మద్దతు అవసరం అవుతుంది. నిపుణుల సలహా తప్పనిసరి కావచ్చు. బరువు తగ్గే విషయంలో డైటీషియన్ అభిప్రాయం తీసుకోండి. వ్యసనాలు వదలకపోతే మానసిక నిపుణులను సలహా అడగండి. తీర్మానం అమలులో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు.. ఫ్యామిలీ డాక్టర్‌తో మాట్లాడండి. స్నేహితులు, బంధువులు, కొలీగ్స్‌లో మీలాంటి తీర్మానమే తీసుకున్న వాళ్లు కొందరైనా ఉంటారు. అంతా కలిసి ఓ వాట్సాప్ గ్రూప్ ప్రారంభించండి. లక్ష్యాలు, గెలుపులు, సవాళ్లు ..మనసులోని భావాలన్నీ పంచుకోండి. చివరగా ఒక మాట. మీ పరిధిలోలేని విషయాల జోలికి వెళ్లకండి. ఫలానా అమ్మాయిని ప్రేమించాలనో, పెండ్లి చేసుకోవాలనో తీర్మానిస్తే మూర?త్వమే అవుతుంది. మీ తీర్మానం మరొకరి జీవితాన్ని ప్రభావితం చేయలేదు.

# జాయ సేనాపతి

జరిగిన కథ : అది మువ్వ మరణించిన రోజు. ఆ విషాదాన్ని తట్టుకుంటూనే తలగడదీవి చేరాడు జాయపుడు. పృథ్వీశ్వరుడు ద్వారంవద్దే నిలిచి.. అనుమకొండ నుంచి వచ్చిన లేఖను చూపాడు. అసలే మువ్వ మరణంతో దిమ్మెరబోయిన జాయచోడుడు.. ఇక క్షణం ఆగలేదు. విక్రమతో కలిసి గిరుక్కున వెనుదిరిగాడు. చీకట్లో అలా అలా.. నడిచి నడిచి ఊర్లు దాటారు. అప్పుడు వినిపించింది.. దప్పు చప్పుడు. అది సూరప్పడి దప్పు. ఇక్కడెక్కడో.. ఏ ఊరు ఇది?! ఇక్కడున్నాడేమిటి? ఆవలగా మిణుకుమిణుకు అంటున్న దీపాల కదలికలు. కాస్త అవతలగా కృష్ణమ్మ నిద్రలో గురక లాంటి మెలమెల్లని గలగలలు. నడుస్తూనే చుట్టూ పరికిస్తూనే ఆ దప్పుశబ్దం వైపుగా నడిచాడు. దగ్గరయ్యాక సూరపను గుర్తించి.. ఆశ్చర్యంగా నిలబడిపోయాడు. అది ఓ పంచములవాడ పొలిమేరలోని తాడితోపు. ఓ తాడిచెట్టు కింద కూర్చుని ఉన్నాడు సూరప. ఒంటిపై వస్త్రం లేదు. కేవలం మొలకు ఓ గోచిగుడ్డ. ఆ దట్టమైన చీకటిలో ఒంటరిగా చెట్టుకు జారగిలబడి అత్యంత విషాద

### రాగాలను వాయిస్తున్నాడు మంద్రంగా..

ఇద్దరూ ఒక్కసారే ఒకరినొకరు చూసుకున్నారు. చటుక్కున లేచి నిలబడ్డాడు సూరప. "దేవరా దండాలు! సావీ దండాలు! ఈ యదవ ఈడ ఉండాడని వచ్చారా దేవరా!" ఘొల్లుమన్నాడు. జాయచోడుడు వెలనాడు విడిచి వెళ్లిపోతున్నాడని అతనికి తెలియదు కదా! "నువ్వేమిటి.. ఇక్కడ?? సరే సరే అసలు సంగతి చెప్పు.. అనుమకొండ వెళ్లావా? రాజాస్థానానికి వెళ్లావా? నాలేఖ చూపావా? రాజాస్థానంలో దప్పుప్రదర్శన చేశావా? పెద్దలంతా ఏమన్నారు? మెచ్చుకున్నారా? బావగారు.. అదే మహామండలేశ్వరులు నీ కళను విని ఏమన్నారు..?"ప్రశ్నల వర్షం. దేనికీ జవాబు చెప్పలేనట్లు జాయపుని పాదాలవద్ద కుప్పకూలిపోయి.. ముఖాన్ని చేతులతో కప్పుకొని కుళ్లికుళ్లి ఏడవసాగాడు. మ్రాన్పడిపోయాడు జాయపుడు. శుభవార్త కాదు.. ఏదో ఘోరం జరిగినట్లుంది. లేపి భుజాన చేయివేసి లాలనగా అడిగాడు. "ఏమైంది.. చెప్పు. దేనికైనా.. ఏ మాట వినడానికైనా సిద్ధపడి ఉన్నాను. చెప్పు చెప్పు.." చెప్పలేనట్లు మరికాసేపు ఏడ్చి తెప్పరిల్లి లేచి మళ్లీ జాయపుని పాదాలవద్ద కూలబడి చెప్పాడు. "తమరి లేఖ సూసి నన్ను సాదరంగా రానిచ్చారు. కళామండపమంట. ఆడ.. పెద్దోళ్ల ముందు నేను దప్పు వాయిస్తున్నాను. మీమీద గురితో నన్ను వాయించమన్నారు కానీ.. ఆళ్లంతా నన్ను రోతగా చూస్తున్నారు. నన్ను, నా దప్పువాదనను ఏమాత్రం ఒప్పుకొనే ధోరణి ఆళ్ల ముఖాల్లో కనపడ్డంలేదు. ఇష్టంలేనట్టు.. అసలు ఆళ్లకు సంగీతమే తెలియనట్లు కూకున్నారు. నన్ను గౌరవించడం సంగతి దేవుడెరుగు.. అసలు ఇనడమే లేదు. నాలో ధైర్యం తగ్గిపోతాంది. దప్పు శ్రుతి తప్పుతాంది. సరిగ్గా అప్పుడే ఆ దేవుడు.. ఆ పెద్దాయన లోపలికొచ్చారు. ఆయన యంట వచ్చినోళ్ల పొగడ్తలతో దప్పు ఆపేశాను. అప్పుడే ఎవురో నా కాడికొచ్చి.. 'కాసేపు నీ దప్పు ఆపరా మాదిగ యధవా! శవాల ముందు వాయించే దప్పు.. రాజనగరిలో మహామండలేశ్వరుల ముందు.. మాబోటి మహావిద్వాంసుల ముందు వాయిస్తావా!? ఎంత ధైర్నం.. సావడానికే ఇక్కడికి వచ్చావ్. ఆపెహే!' అన్నాడు. అట్టాంటోళ్లు సాధారణంగా నా బోటోడితో మాట్లడానికే వొప్పుకోరు. అట్టాంటిది.."

### "సరే సరే.. ఆయన.. మహామండలేశ్వరులు..

వారేమన్నారు??". జాయపునిలో ఆశ్చర్యం, దిగ్భ్రమ కలసిన అసహన కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. "ఆ సావి దేవుడు మారాజా! కానీ, ఆ దేవుడుగోరు కూడా నన్ను కనికరించలేదు. పొమ్మన్నాడు.. 'బయటకు పో.. ఇది రాజాస్థానం. ఇక్కడ గొప్పగొప్ప విధ్వాంసులకే గౌరవం. దప్పు ఇక్కడ వాయించడానికి సరిపోదు. చాటింపుకు, శవాల కాడ వాయించుకో.. పోపో!' అన్నారు సావి.." ఖంగుతిన్నట్లు కొయ్యబారిపోయాడు జాయపుడు. బోరున విలపిస్తున్నాడు సూరప. మళ్లీ చావుదెబ్బ. గొడ్డలితో గుండెపై నరికారు. నరికింది ఎవరోకాదు. బావగారు! అంటే సాక్షాత్తూ దేవుడు!! విక్రమపై వాలిపోయాడు జాయపుడు. అప్పుడు తడిశాయి కళ్లు. తొలిసారి.. బావగారిపై.. నమ్ముకున్న దేవుడే అవమానించినట్లు.. కోపంతో శరీరం వణికింది.

సూరప దప్పు తీసుకుని మెల్లగా వాయించసాగాడు.

చివ్వున కదిలి భుజానున్న ఉత్తరీయం నడుముకు కట్టుకుని స్థానకం తీసుకుని కాలు కదిలించాడు. తలపైకెత్తి రుద్రదేవునికి నమస్కరించి కాలు కదిలించాడు. జాయపుని శరీరభాష గుర్తించిన సూరప నిలబడి ఆయన నృత్త కదలికలకు అనుగుణంగా దప్పు వాయించసాగాడు. ఇద్దరు కళాకారులు తీవ్ర అవమానభారంతో, దుఃఖ భాజమైన మనస్సుతో, విషాద హృదయాన్ని రసావిష్కరణ జరిపితే.. ఆ నృత్తం, తదనుగుణమైన దప్పువిన్యాసం ఎలా ఉంటుందో ఆ అర్ధరాత్రి కటికచీకటిలో.. పైన చంద్రుడు, దగ్గరగా కృష్ణమ్మ, ఆవలగా సముద్రుడు మౌనంగా సజలనయనాలతో వీక్షించారు. ఆ అద్భుత విషాద తాండవ నృత్తవిన్యాసాలకు ఆ రుద్రదేవుడే స్పందించాడా అన్నట్లు అప్పటికప్పుడే చిన్నపాటి వర్షం ఇద్దరినీ తడిపిపోయింది. ఆ వర్షంలో ఆ అలా దప్పు మోగుతూనే ఉంది.. గజ్జెలు లేని పాదాలు తాండవ నృత్తమాడుతూనే ఉన్నాయి. ఆడిఆడి వర్షంలో తడిసి తడిసి అక్కడే కుప్పకూలిపోయాడు జాయపుడు.

### 'ఎంత అవమానం చేశారు బావగారూ!'..


అయితే, గణపతిదేవునితో తను చెప్పమన్న ఒక్కమాట సూరప్పడు చెప్పలేదని జాయపునికి తెలియదు. మర్నాడు ఉదయానికి మొదటి రాజసత్రం వద్దకు చేరాడు జాయపుడు. ధనదుపురానికి, అనుమకొండకు మధ్య పాతిక రాజసత్రాలున్నాయి. అవి కాకతీయ రాజవంశాల వారికి మాత్రమే పరిమితం. చిందరవందరగా ఉన్న తలకట్టు.. అసహ్యంగా పెరిగిన గడ్డం.. బురదలో నృత్తం తొక్కాడేమో.. మట్టి కొట్టుకుపోయిన కంచుకం, పంచె, ఉష్ణీషం.. మొత్తంగా పరమ అసహ్యంగా ఉన్న జాయపుణ్ని చూసి.. రాజసత్రం నిర్వాహకుడు జాలయ అలా ఉండిపోయాడు.

### జాలయ ముఖకవళికలు గుర్తించిన జాయపుడు..

"కాస్త విశ్రాంతి తీసుకుంటాను. మంగళవాడిని పిలిపించు.." అంటూనే తల్పంపై వాలిపోయాడు. క్షౌర సంస్కారంతో కాస్త ఊపిరి తీసుకుని తిరిగి బయల్దేరుతున్న జాయపునితో అన్నాడు జాలయ.. "పై సత్రంవద్దకు తమరికి కొత్తదుస్తులు సిద్ధం చెయ్యమని వార్త పంపాను దేవరా.." తిరిగి చూసి ఆప్యాయంగా నవ్వి విక్రమను అధిరోహించాడు. మరి నాలుగురోజుల తర్వాత అనుమకొండ చేరాడు. అప్పటికి గూడుకట్టుకున్న విషాదం గుమ్మనంగా లోలోన ఘనీభవించింది. ప్రదేశం మారడంతో కాస్త వాన వెలసినట్లు తెరిపిన పడినట్లయ్యింది. సైనిక స్వాగతంతో మరికాస్త తేరుకున్నాడు. పుర నివాసం. మర్నాడు తన పురనివాసం ముందు నిలబడి మొత్తంగా పైనుంచి కిందికి చూసుకున్నాడు. దాని కింది భాగమంతా వెలనాడు మండలేశ్వరుని కార్యాలయం. ఈ మధ్యకాలంలో వెలనాడు మండలాధికారుల కార్యకలాపాలు ఎక్కువకావడంతో మరిన్ని నియోగాలు వచ్చాయి. కానీ, మొదటి అంతర్వులో అతని నివాసం మాత్రం అలాగే ఉంచారు. అంతా తిరిగి చూసుకున్నాడు. తర్వాత రాజప్రాసాదం, నియోగాలు, రాజనగరి.. అంతా తిరిగాడు. రాజప్రాసాదపు రూపురేఖలు మారాయి. రాజనగరిలో కూడా ఎంతో మార్పు.. వీధులు చూస్తూ ఆ ఇల్లు.. గతంలో ఇంద్రాణి వాళ్ల ఇల్లు ఉన్న వీధిలోకి మళ్లబోతూ ఆగి మరోవైపు వెళ్లాడు. ఎదురొచ్చిన వారంతా కొత్తగా కనిపిస్తున్నారు. ఒక్కరో ఇద్దరో పాతవాళ్లు. వాళ్లు కూడా కుశలప్రశ్నలు వేశారు వాళ్ల ధోరణిలో. "జాయసేనానీ.. ఏమిటి.. వెలనాడు వెళ్లాక కాస్త ఒళ్లు చేశారే?!". "కాస్త ముదురు తేలారు.." అంటూ జాయపుణ్ని కొత్తగా చూడసాగారు. పరిపాలనా భవనాలు కూడా కొత్తవి కనిపించాయి. కొత్తనియోగాలు, అధికారులు, మంత్రులు, మహామంత్రులు, సేనానులు, దళపతులు, సైన్యాధ్యక్షులు.. ఒకరేమిటి.. పరిచారికలు, కంచుకీలు, ప్రతీహారులు, కాపలా భటులు.. వేగులు కూడా చాలామంది మారిపోయారు. అక్కడక్కడా పాతముఖాలు కనిపిస్తున్నాయి. కానీ, జాయసేనాని, జాయ చమూపతి, జాయ గజసాహిణి, జాయచోడుడు, జాయ చోడదేవుడు.. ఏ పేరు ఉచ్చరించినా విన్నపేరులా గుర్తుపట్టి ఆత్మీయంగా, అత్యంత వినయవిధేయతలతో, రెప్పవేయని ఆశ్చర్యంతో.. కొత్తవాళ్లు నిబిడాశ్చర్యంతో నోర్లు వెళ్లబెట్టి.. పాతవాళ్లు

మధురస్మృతుల మాధుర్యచూపులతో..

తర్వాత గణపతిదేవుడు వచ్చారని తెలిసినా ఆయనను కలవలేదు. సూరప్పడి అవమానం తనదిగా భావించి.. గణపతిదేవునిపై కలిగిన కోపం ఆయనను కలవకుండా చేసింది.ఓ సాయంత్రం కళామందిరానికి వెళ్లాడు. దూరం నుంచే కళాత్మక పరిమళం! ఆత్మీయబంధం!! ఉద్వేగం హెచ్చింది. గబగబా వెళ్లబోయి సూరప్పడికి జరిగిన అవమానం ఇక్కడే కదా.. అని గుర్తొచ్చి మెల్లగా, మౌనంగా వెళ్లాడు లోపలికి. ఊహాతీతంగా లోపల నాట్యప్రదర్శన.. జాయచోడుని నృత్తరీతులతో లాస్య నృత్తం ప్రదర్శిస్తున్నది లలితాంబ. ఆశ్చర్యంగా చూస్తూ మరికొన్ని అడుగులు వేశాడు. జాయచోడుణ్ని ఆమె చూడటం ఏమిటి.. నృత్తం ఆపడం ఏమిటి.. అందరూ తలతిప్పి జాయచోడుణ్ని చూడటం, గుర్తించడం ఏమిటి!? అన్నీ ఒకేసారి జరిగాయి. మందిరమంతా కోలాహలం.. ఉత్సాహ ఉద్వేగాల పరవళ్లు. ఖంగుతిన్నాడు జాయచోడుడు. అంతా చుట్టుముట్టడంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు. అక్కడున్నవారిలో ముప్పాతిక ముప్పంతులమంది అతనికి పూర్తిగా కొత్త. అయితే జాయచోడుడు వెలనాడు మండలేశ్వరునిగా అక్కడ నిర్మించిన కూసెనపూండి కళాక్షేత్రం, కళాయుద్ధం ద్వారా మతఘర్షణలను నివారించి విజయం సాధించడం.. రెండూ సామాన్య విషయాలు కాదు. ఎవరెవరో ముందుకొచ్చి చేతులు పట్టుకోవడం.. వంగి నమస్కరించడం.. ఏదేదో పొగడటం.. ఏవేవో గుర్తు చేయడం.. తమను తాము పరిచయం చేసుకోవడం.. వాళ్ల రచనలను ఉటంకించడం.. వాళ్ల నాట్య, నృత్త, నృత్యాలను చెప్పుకోవడం.. జాయచోడుని ఇబ్బంది గుర్తించిన లలితాంబ ముందుకొచ్చి అందరినీ నిలువరించి ఒక్కొక్కరినీ ఆయనకు పరిచయం చేయసాగింది. అది అందరికీ ఎంతో బాగున్నా.. జాయచోడుని ముఖ కవళికలు చూస్తుంటే అసలు వింటున్నాడో లేదోనని వారంతా భావిస్తుండగా.. జాయచోడుడే లలితను మెల్లగా అడిగాడు. "లలితా.. మహామండలేశ్వరులు.. అదే బావగారు ఇప్పుడు ఇక్కడికి వస్తారా??" "ఇప్పుడే మరికొన్ని క్షణాలలో వారు ఎప్పుడైనా రావచ్చు. నిన్ననే నన్ను అడిగారు.. 'జాయ వచ్చాడు కలిశావా!?' అని.." మరేదో చెప్పబోతుండగా చటుక్కున చేతులెత్తి అందరికీ నమస్కరించి.. వేగంగా ఎవరో తరుముతున్నట్లు బయటికి వెళ్లిపోయాడు జాయచోడుడు. అయితే ఆయన తొందరతొందరగా వెళ్లిపోతుండటం.. అప్పుడే పల్లకి దిగిన గణపతిదేవుడు చూశాడని జాయచోడునికి తెలియదు. అంతఃపురంలోకి వెళ్లబోతూ ఆ ద్వారాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు ఒక్కటే ద్వారం! మొన్న వచ్చాడు కదా.. అప్పుడు గుర్తించలేదు.. అక్కను చూడాలన్న తొందరలో. అంటే బావగారు రెండు అంతఃపురాలు ఏకం చేశారన్నమాట. గతంలో హరిహరుని మరణవార్త అందినప్పటి సంఘటన గుర్తొచ్చింది. అద్దంకి, పాకనాడు రాజ్యాల మతగొడవల సమయంలో.. "దేవరా తమరికి ప్రత్యేక వార్త" అంటూ అనుమకొండ వార్తాహరుడు లేఖాపత్రాన్ని అందించాడు. 'హరిహరదేవుడు మరణించాడు..' భారంగా కుప్పకూలిపోయాడు. తమ పిల్లలు తమ కళ్లముందే మరణించడం.. హతవిధీ!! పసివాడిగా ఉన్నప్పుడే అతనిపై విషప్రయోగం జరిగినప్పటినుంచీ హరిహరదేవుడు కోలుకోలేదు. ఎప్పుడూ ఏదో అనారోగ్యమే. చివరికి శివసాయుజ్యం పొందాడు. "ఒకడికి మేము కొలిచే మురారి అని, మరొకడికి హరిహరులకు భేదం లేదని మేము నమ్మినట్లు హరిహర దేవుడు అని నామకరణం చేద్దాము.." అన్నాడు గణపతిదేవుడు కొడుకులు పుట్టిననాడు.



### అక్కకు, బావగారికి గర్భశోకం!

ఇద్దరు కళాకారులు తీవ్ర అవమానభారంతో, విషాద హృదయాన్ని రసావిష్కరణ జరిపితే.. ఆ నృత్తం, తదనుగుణమైన దప్పువిన్యాసం ఎలా ఉంటుందో ఆ అర్ధరాత్రి కటికచీకటిలో.. పైన చంద్రుడు, దగ్గరగా కృష్ణమ్మ, ఆవలగా సముద్రుడు మౌనంగా సజలనయనాలతో వీక్షించారు.

# వైరస్‌ను మించిన వైరల్

విశ్వ మహమ్మారిగా మారిన కరోనా సృష్టించిన బీభత్సం ఇంతా అంతా కాదు. 70 కోట్ల పైచిలుకు మంది వైరస్ బారిన పడితే అందులో ఏడు లక్షల మంది కన్నా ఎక్కువే ప్రాణాలు విడిచారు. సకల వ్యవస్థలు స్తంభించిపోయాయి. అంతటి ఘోరకలి చూసి ఉండటం వల్ల ఇప్పుడు ఏ చిన్న వైరస్ చిటుక్కుమన్నా ప్రపంచం ఉలిక్కి పడుతున్నది. తాజాగా చైనాలో బయటపడిన హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్) కలకలం సృష్టిస్తున్నది. కరోనా భయావహ జ్ఞాపకాల నీడలో ఈ సరికొత్త వైరస్ కొంత బెదురు కలిగించడంలో ఆశ్చర్యం లేదు. కరోనా లాగే ఇదీ చైనాలో పుట్టడం, సోషల్ మీడియా ఊదరగొట్టడం ప్రస్తుత కలకలానికి కొంత కారణమని చెప్పక తప్పదు. గతవారం రోజులుగా మీడియాలో హెచ్‌ఎంపీవీ గురించిన కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. వైరస్ కన్నా వైరల్ అవుతున్న ప్రచారం ప్రమాదకరం. కరోనా పిల్లలకు ఎక్కువగా సోకకపోవడం, ప్రస్తుత వైరస్ పిల్లల్లోనే ముఖ్యంగా కనిపిస్తుండటం వంటి కారణాలు భయాలకు దారితీస్తున్నాయి. ఇప్పటివరకు పది లోపు కేసులు, అదీ గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. చైనాలో వ్యాపించింది నిగూఢమైన, లేదా సరికొత్త వైరస్ అనే కథనాలు విరివిగా వచ్చాయి. కానీ, ఇవేవీ నిజాలు కావని వెల్లడైంది. ఏటా శీతాకాలంలో శ్వాసకోశ వైరస్‌లు కొత్త రూపంలో బయటపడటం జరుగుతూనే ఉంటుంది. హెచ్‌ఎంపీవీ కూడా అంతేనని తెలియవస్తున్నది. ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వైరస్‌ను కొవిడ్‌తో పోల్చి చూపడం జరుగుతున్నది. ఒక చానెల్ అయితే ఏకంగా మరో మహమ్మారి అంటూ చాటింపు వేస్తున్నది. ఇదంతా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతుండటం వల్ల అనవసరమైన ఆందోళనకు దారితీస్తున్నది. కొవిడ్‌కు, ప్రస్తుత వైరస్‌కు మధ్య మౌలిక తేడా ఏమిటో ప్రజలు తెలుసుకుంటే ఈ పరిస్థితి ఉండనే ఉండదు. కొవిడ్ మూలాలు ఇప్పటికీ తెలియవు. అది నిజంగా కొత్త వైరస్. కాగా హెచ్‌ఎంపీవీ తెలిసిన మూలాల నుంచి వచ్చిందే. పైగా అది ఆర్‌ఎన్‌ఏతో తయారైనది కాగా ప్రస్తుత వైరస్ డీఎన్‌ఏతో తయారైంది. అంతేకాదు, 2001 నుంచి ఈ వైరస్ వైద్య ప్రపంచానికి తెలిసిందేనని గూగుల్ సెర్చ్ చేసినా తెలిసిపోతుంది. కొత్త వైరస్ పూర్తిగా ఒకటి కంటే ఎక్కువ దేశాల్లో వ్యాపిస్తేనే దాన్ని పాండెమిక్ లేదా మహమ్మారి అంటారు. చైనాలో పెద్ద ఎత్తున శ్వాసకోశ వ్యాధులు పెరిగినట్టు తనకు ఎలాంటి సమాచారం అందలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించడం గమనార్హం. గత ఏడాది కన్నా ఈ ఏడాది కేసులు తక్కువగా ఉన్నట్టు చైనా వ్యాధుల నియంత్రణ, నివారణ విభాగం పేర్కొనడం ఆలోచించాల్సిన విషయం. మరోవైపు సరికొత్తదీ అని ప్రచారం చేస్తున్న వైరస్ గురించి అంతర్జాతీయ మీడియా పెద్దగా పట్టించుకోవడం లేదనేది గుర్తించాలి. హెచ్‌ఎంపీవీ గురించి భయపడిపోయి బెంగటిల్లడం కన్నా తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని వైద్య ప్రపంచం అంటున్నది. చికిత్స కంటే నివారణే ప్రధానమనేది తెలిసిందే. ఏ వైరస్ అయినా వ్యాపించే మార్గం ఒకటే. కరోనా పుణ్యమా అని జాగ్రత్తలూ తెలిసినవే. అవి సామాన్యమాన రీతిలో పాటించినా హెచ్‌ఎంపీవీ కాదు కదా, ఆ మాటకు వస్తే ఏ వైరస్ కూడా దరిచేరదు. ఈ లోగా సోషల్ మీడియా బెదరగొట్టకుండా ఉంటే చాలు.

# కొత్త నిర్ణయాలు .. కొనసాగిద్దాం ఇలా



నూతన సంవత్సరంలో అడుగు పెట్టేశారు.. హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ సందడి చేసే ఉంటారు.. బంధువులకు, స్నేహితులకు అందరికీ న్యూ ఇయర్ విషెస్ చెప్పే ఉంటారు..పనిలో పనిగా అది చేద్దాం, ఇది చేద్దాంఅని బోలెడు నిర్ణయాలు తీసుకొనే ఉంటారు. ఎప్పుడైనా ఆలోచించారా?..ఏటా జనవరిలో తీసుకునే నిర్ణయాలు ఎంతవరకు కొనసాగిస్తున్నామో అని. పోయిన ఏడాది తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలు చేశారో.. ఓసారి గుర్తుతెచ్చుకోండి. చాలావరకు మధ్యలోనే వదిలేసి ఉంటారు కదా. మీరే కాదు.. ప్రపంచంలో 92 శాతం మంది ఇదే బాపతు. 2024 జనవరిలో 18 నుంచి 29 ఏళ్ల మధ్య వారు 49 శాతం, 30 నుంచి 49 ఏళ్ల మధ్య వారు 31 శాతం, 50 ఏళ్లు పైబడిన వారు 21 శాతం కొత్త నిర్ణయాలు తీసుకున్నారట. అందులో 43 శాతం మంది ఫిబ్రవరి నెలలో, 46 శాతం మంది ఆరు నెలల్లో తీసుకున్న నిర్ణయాలను గాలికి వదిలేశారట. కేవలం 8 శాతం మంది మాత్రమే ఏడాది చివరి వరకు వారు తీసుకున్న నిర్ణయాలను కొనసాగించారట. సో.. న్యూ ఇయర్‌లోకి అడుగు పెట్టగానే నిర్ణయాలు తీసుకోవడం, వాటిని మధ్యలోనే వదిలేయటం ఓ రివాజు అన్నమాట.

**ఎందుకు అలా?**

నూతన సంవత్సరం మొదట్లో ఎంతో ఉత్సాహంతో, నిబద్ధతతో తీసుకున్న నిర్ణయాలను మధ్యలోనే ఎందుకు వదిలేస్తున్నామని ఎప్పుడైనా ఆలోచించారా?.. సైకాలజిస్టులు జానెట్ పాలవి, పీటర్ హెరమన్‌లు ఈ విషయంపై ఆలోచించారు. నిర్ణయాలను ఇలా మధ్యలోనే వదిలేయడానికి నాలుగు కారణాలు ఉన్నాయని వారి అధ్యయనంలో తెలిసింది.

ఎవరైనా సరే తమ అలవాట్లు వ్యవస్థలో పెనుమార్పులు తీసుకురాగలవని నమ్ముతారు, ఆ మార్పులు కంటికి కనిపించక వాటిని వదిలేస్తారు.

వారు కోరుకున్న మార్పు రావడానికి ఎంతో సమయం పట్టదు అని, చాలా కొద్ది రోజుల్లోనే తాము అనుకున్న సాధిస్తామని భ్రమ పడతారు.

తమ అలవాట్లు, ప్రవర్తనను మార్చుకోవడానికి కావలసిన శక్తి వారికి లేకపోయినా, ఆ విల్‌పవర్ తమకు ఉందని అపోహ పడతారు.

కొత్త అలవాట్లతో, ప్రవర్తనలో మార్పులతో జీవితంలో అద్భుతాలు జరుగుతాయని ఆశ పడతారు. అలా జరగకపోవడంతో నిరాశ పడతారు.

ఈ నాలుగు రకాల అవాస్తవ ఆలోచనలు, అంచనాల కారణంగానే కొత్త ఏడాది సందర్భంగా తీసుకునే నిర్ణయాలను మధ్యలోనే వదిలేస్తారు.

**కొనసాగించడం ఎలా?**

ఇదంతా తెలుసుకొని అసలు అమలు చేయలేనప్పుడు నిర్ణయాలు తీసుకోవడం ఎందుకు అని వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. కొద్దిపాటి జాగ్రత్తలు, చిన్నచిన్న మార్పులతో నూతన సంవత్సర నిర్ణయాలను కొనసాగించవచ్చని మానసిక నిపుణులు చెప్తున్నారు.

**ఓ మంత్రం అనుకోండి..**

నూతన సంవత్సరంలో అది చేద్దాం.. ఇది చేద్దాం, ఇది మార్చేద్దాం.. అది మార్చేద్దాం అనుకోకుండా మీరు ఆచరించాల్సిన ఒక పదాన్ని తీసుకోండి, దాన్నే మంత్రంగా భావించండి. ఈ ఏడాదిలో కోపాన్ని తగ్గించుకుందాం.. రోజు వ్యాయామం చేద్దాం.. అందరితో స్నేహంగా ఉందాం.. ఇలా అన్నమాట. వందలు వద్దు.. ఒక్కటి మాత్రమే తీసుకోండి. దానికి ఎటువంటి టార్గెట్స్ పెట్టుకోవద్దు. ఏదైతే మంత్రంగా భావించారో దాన్ని ఏడాదంతా కొనసాగించడానికి ప్రయత్నించండి. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా.. అనుకోవాల్సిన అవసరం లేదు, సత్ఫలితాలను మీరే చూస్తారు.

**ఏం వద్దనుకుంటున్నారో లిస్ట్ రాయండి..**

సాధారణంగా కొత్త సంవత్సరంలో అడుగు పెట్టగానే అందరూ చేసే పని ఏంటంటే.. అది చేసేద్దాం ఇది చేసేద్దాం అని అనుకోవడం. అలా కాకుండా ఏం చేయకూడదని భావిస్తున్నారో నిర్ణయించుకోండి. డబ్బులు దుబారా చేయకూడదు.. ఆఫీస్‌కి లేటుగా వెళ్లకూడదు.. స్నేహితులు, బంధువులతో గొడవలు పెట్టుకోకూడదు.. ఇలా అన్నమాట. ఏం చేద్దాం అనే దానికంటే ఏం చేయకూడదు అనేది బాగా పనిచేస్తుందని నిపుణుల మాట.

**నెలకో లక్ష్యం రాసుకోండి..**

ఇలా చేయాలి.. అలా చేయాలి అనుకోవడం కంటే ఏ నెలలో ఏం చేయాలో రాసి పెట్టుకుంటే అనుకున్నది సాధించవచ్చు. జనవరి నెల అంతా తక్కువగా మాట్లాడాలి.. ఫిబ్రవరి అంతా ధ్యానం చేయాలి.. మార్చి నెల అంతా ఎమోషన్స్ కంట్రోల్లో ఉంచుకోవాలి.. ఇలా 12 నెలలకు 12 లక్ష్యాలు నిర్దేశించుకోండి. నెలలో 30 రోజులు దాన్ని పాటించడానికి ప్రయత్నించండి.

**చిన్ని చిన్ని ఆశ..**

చాలాసార్లు చేసే పొరపాటు ఏంటంటే పెద్ద పెద్ద లక్ష్యాలను పెట్టుకోవడం, వాటిని సాధించలేక చతికిలబడటం. అందుకే మీరు సాధించాలనుకున్న లక్ష్యానికి చేరుకోవడానికి దోహదపడే చిన్న చిన్న లక్ష్యాలను ఎంచుకోండి. ఒక్కో చిన్న లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళిక రూపొందించండి. చిన్న లక్ష్యాలను సాధించినప్పుడు మీలో డోపమైన్ రిలీజ్ అయి ముందున్న లక్ష్యాలను సాధించడానికి మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. ఇదండీ కొత్త సంవత్సరం నిర్ణయాలను కొనసాగించే విధానం. ఇవన్నీ ఏదో గాలి మాటలు కాదు, పరిశోధనలను ఆధారంగా చేసుకొని రూపొందించిన పద్ధతులు. వీటిని అవగాహన చేసుకోండి.. నూతన సంవత్సరంలో మీ లక్ష్యాలను సాధించండి.. విష్ యు ఆల్ ద బెస్ట్.

**21-90 రూల్**

ఏదైనా కొత్తగా అలవాటు కావాలంటే కనీసం 21 రోజులు పడుతుంది. ఆ అలవాటు జీవనశైలిలో భాగం కావాలంటే 90 రోజులు పడుతుంది. అంతవరకు కొత్త అలవాటును కొనసాగించాలి. అలా కాకుండా రెండో మూడో వారాలు చూసి ఏ మార్పూ లేదని మధ్యలోనే వదిలేయకూడదు. ఇది చాలామంది చేసే పొరపాటు. నూతన సంవత్సర నిర్ణయాలను ఫిబ్రవరి నాటికి వదిలేయడానికి కారణం ఇదే.

# ఇదే మంచి కాలం.. భారతావనిని చుట్టేసొద్దాం!



విభిన్నమైన భౌగోళిక ప్రాంతాలు, వాతావరణ మండలాలు, సంస్కృతులు, ఆహార విధానాలతో భారతదేశం వైవిధ్యభరితంగా ఉంటుంది. అసలు మన భూగ్రహానికి మన దేశం ఓ నఖలుగా సగర్వంగా చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలో 2025 ఏడాదిలో కొత్తగా మన భారతావనిని సందర్శించండి. మనదేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాలు కురుస్తాయి. మార్చి చివరి నుంచి మే వరకు ఎండలు మండుతుంటాయి. కాబట్టి అక్టోబర్ నుంచి మార్చి మధ్య కాలం భారతదేశంలో ఏ ప్రాంతాన్ని సందర్శించడానికైనా అత్యుత్తమమైన సమయం. హిమాలయాల్లో వేసవి విడుదులను సందర్శించడానికి ఏప్రిల్ నుంచి జూన్ నెల తొలివారం వరకు మంచి సమయం.

**బొంబాయి-గోవా**

ఈ రెండు ప్రాంతాలను ప్లాన్ చేసుకుంటే పండర్‌పుర్, తుల్జాపుర్, షిర్డీ, నాసిక్ లాంటి పుణ్యక్షేత్రాలతోపాటు మహారాష్ట్రుల కోటలు, అరేబియా సముద్రం అందాలు, గోవాలో పోర్చుగీసుల సాంస్కృతిక ఆనవాళ్లు, బొంబాయిలో బ్రిటిష్ కాలపు నిర్మాణాలను చూడొచ్చు.

**ఢిల్లీ-రాజస్థాన్**

ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాలను కలిపి ప్లాన్ చేసుకుంటే మంచిది. ఒకేసారి దేశ రాజధానితోపాటు, రాజస్థాన్‌లోని కోటలు, ఆగ్రాలోని తాజ్‌మహల్, మథుర, బృందావనంలో కృష్ణ పరమాత్ముడి మధురస్మృతులను నింపుకొని రావచ్చు.

**గుజరాత్‌జి**

సోమనాథ్ జ్యోతిర్లింగం, ద్వారక శ్రీకృష్ణ మందిరం, మహాత్మాగాంధీ పుట్టిన పోర్‌బందర్‌తోపాటు రాజధాని గాంధీనగర్, అహ్మద్‌నగర్, కచ్ ఉప్పు నేలలు, గిర్ సింహాల అడవి దర్శనీయ ప్రదేశాలు.

**కర్ణాటక-కేరళ**

బెంగళూరు, మైసూరు నగరాలు, కావేరీ నదితోపాటు కేరళలో పశ్చిమ కనుమల అందాలు, అరేబియా సముద్ర బీచ్‌లు, అనంతపద్మనాభ స్వామి దేవాలయం తదితరాలు, సముద్రపు కాల్వల్లో పడవ ప్రయాణాలు జీవితకాలపు జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

**తమిళనాడుజి**

మిగిలిన దేశానికి భిన్నంగా తమిళనాడులో అక్టోబర్ డిసెంబర్ మధ్యలో వర్షాలు, తుపానులు వస్తాయి. మిగిలిన సమయంలో ఎప్పుడైనా ఈ రాష్ట్రాన్ని చుట్టేసిరావచ్చు. మహాబలిపురం, కంచి, తంజావూరు, మదురై, కన్యాకుమారి, ఊటీ ఇక్కడి ప్రసిద్ధ స్థలాలు.

**ఉత్తరప్రదేశ్-బిహార్**

అయోధ్య, ప్రయాగ త్రివేణి సంగమం, కాశీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని తీర్థయాత్ర స్థలాలు. బిహార్‌లో బుద్ధ భగవానుడు జ్ఞానోదయం పొందిన గయ, ఆయన జీవితంతో ముడిపడిన రాజ్‌గిర్, నలంద తదితర ప్రదేశాలు దర్శనీయాలు.

**ఒడిశా-పశ్చిమబెంగాల్**


ఒడిశా రాజధాని భువనేశ్వర్ దేవాలయాల నగరంగా ప్రసిద్ధి చెందింది. దగ్గర్లోనే పూరీ జగన్నాథ దేవాలయం, కోణార్క్ సూర్యదేవాలయం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. బెంగాల్‌లో రాజధాని కోల్‌కతా నగరంతోపాటు శాంతినికేతన్, డార్జిలింగ్ చూడదగ్గ ప్రదేశాలు. హిమాలయాల ఒడిలో

ఒదిగిపోయిన సిక్కిం రాష్ట్రం డార్జిలింగ్‌కు దగ్గరే.

**ఈశాన్య భారతదేశం**

అసోంతో కలుపుకొని ఏడు రాష్ట్రాలు భాగంగా ఉండే ఈశాన్య దేశంలో కామాఖ్య దేవాలయం, బ్రహ్మపుత్ర నదిలో మజూలీ ద్వీపం, అరుణాచల్‌లో తవాంగ్‌లోయ మొదలైనవి చూడదగ్గ ప్రదేశాలు. ఢిల్లీతోపాటు చూడాలనుకుంటే పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్, లఢఖ్ ప్రాంతాలను కూడా పర్యాటక జాబితాలో చేర్చుకోవచ్చు. కేదార్‌నాథ్, బదరీనాథ్, గంగోత్రి, హరిద్వార్ తదితర ప్రదేశాలతో అలరారే దేవభూమి ఉత్తరాఖండ్ కూడా ఢిల్లీ ద్వారా వెళ్లగలిగే పర్యాటకుల స్వర్గధామమే.

# క్రాంతి వర్సెస్ కాంతి




రాత్రి తొమ్మిది కావొస్తున్నది. ఏదో కేసు ఫైల్ చూస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర. ఇంతలో మొబైల్ మోగింది. 'సార్.. ఓఆర్‌ఆర్ మీద ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మీరు త్వరగా రండి'.. ఫోన్‌లో అటునుంచి ఎవరో కంగారుపడుతూ చెప్పాడు. వివరాలు తీసుకొన్న రుద్ర సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొన్నాడు. మృతుడి వయసు 20 ఏండ్లకు అటూ ఇటూగా ఉంటుంది. శరీరాన్ని ఏదో జంతువు రక్కిన గుర్తులు కూడా ఉన్నాయి. 'ఫోన్ చేసింది మీరేనా?' ఎదురుగా ఉన్న వ్యక్తిని ప్రశ్నించాడు రుద్ర. 'అవును సార్. నేనే మీకు ఫోన్ చేశా' సమాధానమిచ్చాడు అతను. 'మీ పేరు? ఈ టైమ్‌లో మీరు ఇక్కడేం చేస్తున్నారు? ఓఆర్‌ఆర్‌పై ఎందుకు ఆగినట్టు?' సూటిగా ప్రశ్నించాడు రుద్ర. 'సార్.. నా పేరు క్రాంతి. నేను కొత్తగా కొన్న నా ఎలక్ట్రిక్ కారులో వెళ్తున్నా. బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయింది. చార్జింగ్ స్టేషన్లు కూడా దగ్గర్లో ఎక్కడా కనిపించలేదు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించింది. ఏంటా అని కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి చూశా. ఎదురుగా శవం కనిపించింది. వెంటనే మీకు ఫోన్ చేశా' ఆందోళనతో క్రాంతి చెప్తూ పోయాడు. సరేనన్న రుద్ర.. క్రాంతి ఫోన్ నంబర్, ఇతర వివరాలు తీసుకొన్నాడు. ఇంతలో..'సార్.. ఇదేదో యాక్సిడెంట్ కేసులా కనిపిస్తుంది. పాపం కుర్రాడిది చిన్నవయసే' అంటూ బాధపడ్డాడు హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి. 'అవును బాబాయ్. చిన్నవయసే. కానీ, ఇది యాక్సిడెంట్ కేసులా కనిపించట్లేదు. నిజంగా యాక్సిడెంట్ జరిగితే ఓఆర్‌ఆర్ మీద వాహనాలు వచ్చే స్పీడ్‌కు డెడ్‌బాడీ పరిస్థితి ఇంకోలా ఉండేది. అయితే ఈ కుర్రాడి శరీరం మీద ఏ కుక్కనో, నక్కనో రక్కినట్టు కొన్ని గుర్తులు ఉన్నాయి తప్ప మరేం గాయాలు కనిపించట్లేదు. ఏదేమైనా, ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చాక గానీ మరిన్ని విషయాలు తెలియవు' అన్నాడు రుద్ర. అవునన్నట్టు తలూపాడు రామస్వామి. 'సార్.. నాకు లేట్ అవుతుంది. నేను వెళ్లొచ్చా?' క్రాంతి అడిగాడు. 'బ్యాటరీ డౌన్ అయ్యి కారు చెడిపోయింది అన్నారుగా. ఎలా వెళ్తారు?' ప్రశ్నించాడు రుద్ర. 'ఏదైనా క్యాబ్ బుక్ చేసుకొని వెళ్తా' సమాధానమిచ్చాడు క్రాంతి. 'మరి కారు?' మళ్లీ ప్రశ్నించాడు రుద్ర. 'రేపు వచ్చి కారు తీసుకుపోతాను సార్' మళ్లీ బదులిచ్చాడు క్రాంతి. 'హత్య గురించి ఇంతరాత్రి పూట మాకు విలువైన సమాచారం ఇచ్చారు. మిమ్మల్ని ఒక్కరినే అలా ఎలా పంపిస్తాం? మరేంపర్లేదు. మిమ్మల్ని మా కానిస్టేబుల్స్ ఇంటి దగ్గర విడిచిపెడతార'ని రుద్ర క్రాంతికి చెప్పాడు. ఫోరెన్సిక్ రిపోర్ట్ రాకముందే, ఆ కుర్రాడిది హత్య అని రుద్ర ఎలా కనిపెట్టాడని రామస్వామిసహా మిగతా కానిస్టేబుల్స్ అందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఇంతలో 'నేను ఒంటరిగానే వెళ్తా సార్. పోలీసుల సాయం ఏమీ వద్దు' అంటూ కాస్త భయపడుతూ క్రాంతి అన్నాడు. 'ఎందుకు వద్దు?' గద్దించాడు రుద్ర. 'మాది పద్ధతిగల ఫ్యామిలీ సార్.. ఇంటికి పోలీసులు వస్తే, మా అమ్మానాన్న తట్టుకోలేరు' అన్నాడు క్రాంతి. 'మరి అంత పద్ధతిగల ఫ్యామిలీ నుంచి వచ్చిన నువ్వు.. ఈ కుర్రాడిని ఎందుకు చంపావ్?' బాంబు పేల్చాడు రుద్ర. ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం. 'సార్.. ఏం మాట్లాడుతున్నారు? యాక్సిడెంట్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్ ఇవ్వడం కూడా తప్పేనా? అదే తప్పయితే ఇకపై ఎవరూ ఎవరికీ ఏ సాయం చేయరు. మానవత్వమే మంటగలిసిపోతుంది' అంటూ ఏడ్చినంత పని చేశాడు క్రాంతి. 'డియర్ క్రాంతి. ఈ సెంటిమెంటల్ డైలాగ్స్ ఇక ఆపడం నీకే బెటర్. ఈ హత్య నువ్వే చేశావని ఇప్పటికిప్పుడు నేను రుజువు చేయగలను. మర్యాదగా నువ్వే నిజం చెప్తే అది నీకే మంచిది' స్పష్టంగా అన్నాడు రుద్ర. కాస్త ఆలోచించాక.. ఏం పాలుపోని క్రాంతి.. ఆ హత్య తానే చేశానని ఒప్పేసుకొన్నాడు. అయితే ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని ఓ షాకింగ్ విషయం కూడా చెప్పాడు. అది విన్న రుద్ర అండ్ టీమ్‌కు ముచ్చెమటలు పట్టాయి. ఆ విషయం పక్కనబెడితే, క్రాంతినే ఆ కుర్రాడిని హత్య చేశాడని రుద్ర ఎలా కనిపెట్టాడు? ఓఆర్‌ఆర్‌పై పడివున్న కుర్రాడిని తానే హత్య చేశానని ఎట్టకేలకు ఒప్పుకొన్న క్రాంతి.. ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని చెప్పాడు. దీంతో మరెందుకు ఈ హత్య చేశావని ఇన్‌స్పెక్టర్ రుద్ర గద్దించాడు. దీనికి క్రాంతి స్పందిస్తూ.. 'సార్.. గత కొన్ని రోజులుగా నన్ను ఓ చీకటి శక్తి వెంటాడుతుంది. అది చెప్తేనే నేను ఈ అబ్బాయి మీదకు ఆ వాయువును వదిలా' అంటూ క్రాంతి చెప్తూ పోయాడు. ఆ మాటలు విన్న రుద్ర, హెడ్ కానిస్టేబుల్ రామస్వామి ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు. 'ఏం బాబూ.. మేం మీకు ఎలా కనిపిస్తున్నాం? లాఠీకి పని చెప్పించేలా ఉన్నావే..' అంటూ కాస్త కరువుగా అంటున్న రామస్వామిని వారించిన రుద్ర.. క్రాంతిని స్టేషన్‌కు తీసుకురమ్మని పురమాయించాడు. మరుసటి రోజు.. 'మిస్టర్ క్రాంతి. హత్య చేశానని ఒప్పేసుకొన్నావ్. అంతవరకూ ఓకే. అయితే, అసలు కారణం ఏమిటన్నది మాత్రం చెప్పకుండా ఏదేదో మాట్లాడుతున్నావ్. ఇది నీకు మంచిదికాదు' అంటూ గంభీరంగా అన్నాడు రుద్ర. 'సార్.. హత్య నేనే చేశా. అయితే, నాకు తెలియకుండానే అది జరిగిపోయింది. అసలు ఆ అబ్బాయి ఎవరో కూడా నాకు తెలియదు' క్రాంతి నిశ్చయంగా చెప్పాడు. 'తెలియని అబ్బాయిని ఎందుకు చంపావ్?' ప్రశ్నించాడు రుద్ర. 'చెప్పాను కదా సార్.. ఓ చీకటి శక్తి చెప్తేనే చేశా' మళ్లీ అదే చెప్పాడు క్రాంతి. దీంతో క్రాంతి అబద్ధమైనా చెప్తుండాలి లేదా మతి స్థిమితంగానైనా లేకుండా ఉండాలి అని రుద్ర మనసులో అనుకొంటూ ఉండగా కుర్రాడి పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చింది.

**సమాధానం :** క్రైమ్ స్పాట్‌కు వచ్చీరాగానే 'ఈ టైమ్‌లో ఓఆర్‌ఆర్‌పై ఏం చేస్తున్నారం'టూ క్రాంతిని రుద్ర ప్రశ్నించాడు. దానికి తాను ఓఆర్‌ఆర్ మీదుగా కారులో వెళ్తుండగా బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయిందని క్రాంతి బదులిచ్చాడు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించి కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి శవాన్ని చూసినట్టు చెప్పాడు. నిజానికి కారు బ్యాటరీ డౌన్ అయ్యాక, హెడ్‌లైట్లు కూడా ఆన్ కావు. ఈ చిన్న లాజిక్‌నే రుద్ర కనిపెట్టాడు. పక్కనే ఉన్న టోల్‌ప్లాజా నుంచి కారు దాటడం సీసీటీవీలో రికార్డు కావడంతో భవిష్యత్తులో ఈ హత్య తనమీదకు వస్తుందని భావించిన క్రాంతి.. తాను తప్పించుకోవడానికి ఏమీ తెలియనట్టు తానే పోలీసులకు సమాచారమిచ్చాడు. అయితే, కారు బ్యాటరీ డౌన్ అయిందని అబద్ధం చెప్పి దొరికిపోయాడు. కాగా.. క్రాంతి ఈ హత్యను ఎందుకు చేశాడు? ఒక్క గాయం కనిపించకుండా కుర్రాడిని ఎలా చంపాడు? దీని వెనుక కారణమేంటన్న విషయాలపై రుద్ర టీమ్ దర్యాప్తు మొదలుపెట్టింది.

# ఆందోళన కలిగిస్తున్న కొత్త వైరస్ సురక్షితంగా ఉండాలంటే ఇమ్యూనిటీని ఇలా పెంచుకోండి

కరోనా భయం ఇంకా పూర్తిగా తొలగకముందే ప్రస్తుతం మరో కొత్త వైరస్ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. చైనాలో కొత్తగా హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వ్యాప్తి చెందుతుండడంతో అక్కడ హాస్పిటల్స్ అన్నీ కిక్కిరిసిపోతున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు హల్ చల్ చేస్తున్నాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా దేశాలు అలర్ట్ అయ్యాయి. ఇక భారత్ లోనూ హెచ్‌ఎంపీ వైరస్‌కు చెందిన కేసులు 5 నమోదైనట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అయితే ఈ కొత్త వైరస్ కూడా కరోనా లాంటి లక్షణాలను కలిగిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందువల్ల రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని వారు సూచిస్తున్నారు. అయితే ఇందుకు గాను మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో సహజసిద్ధంగా లభించే పదార్థాలతోనే మన ఇమ్యూనిటీ పవర్‌ను రెండింతలు పెంచుకోవచ్చు. అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం.



**పండ్లు..**

శరీర రోగ నిరోధక శక్తి పెరగాలంటే సీజనల్ పండ్లతోపాటు ఇతర పండ్లను కూడా మనం తినాల్సి ఉంటుంది. ముఖ్యంగా నిమ్మజాతికి చెందిన సిట్రస్ పండ్లను తినాలి. నారింజ పండ్లు ఇదే కోవకు చెందుతాయి. అలాగే నిమ్మ, ద్రాక్ష, కివి, బెర్రీ పండ్లు, క్యాప్సికం వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి ఊపిరితిత్తుల కణజాలాన్ని రక్షిస్తాయి. దీంతో హెచ్‌ఎంపీ వైరస్ నుంచి రక్షణ లభిస్తుంది. వ్యాధి రాకుండా జాగ్రత్త పడవచ్చు.

**గ్రీన్ టీ..**

గ్రీన్ టీని రోజూ రెండు కప్పులు సేవిస్తున్నా కూడా రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. గ్రీన్ టీలో కాటెకిన్స్ అని పిలవబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శ్వాసకోశ సమస్యలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. గ్రీన్ టీలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. కనుక హెచ్‌ఎంపీ వైరస్ నుంచి సురక్షితంగా ఉండాలంటే రోజూ గ్రీన్ టీని సేవించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉన్న ఆహారాలను తింటున్నా కూడా ఈ వైరస్ నుంచి రక్షణ లభిస్తుంది. మనకు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా చియా విత్తనాలు, అవిసె గింజలు, వాల్ నట్స్ లో లభిస్తాయి. ఇవి ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతాయి. శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తాయి. దీంతో శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

**అల్లం రసం..**


అల్లం రసాన్ని సేవిస్తున్నా కూడా రోగ నిరోధక శక్తిని అమాంతం పెంచుకోవచ్చు. అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు నొప్పి, దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. అల్లంను ఆహారంలో భాగం చేసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. హెచ్‌ఎంపీ వైరస్ నుంచి రక్షణ లభిస్తుంది. అదేవిధంగా రోజూ ఉదయాన్నే పరగడుపునే 2 వెల్లుల్లి రెబ్బలను తింటున్నా కూడా ఇమ్యూనిటీ పవర్‌ను అమాంతం పెంచుకోవచ్చు. వెల్లుల్లిలోనూ యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కనుక హెచ్‌ఎంపీ వైరస్ నుంచి రక్షణ లభించాలంటే రోజూ వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకుని హెచ్‌ఎంపీ వైరస్ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శనివారం 08 - 03 - 2025

# సవరణలు కోరితే చిక్కులే!

ఎస్సీ వర్గీకరణ అనేది ముప్పయ్యేండ్ల ఉద్యమమే కాదు, అంతకుముందు ఇరవై ఏళ్లుగా నానుతున్న సమస్య. ఇది ఎస్సీ కులాల్లోని అసమానతలను రాజ్యాంగబద్ధంగా ఎస్సీ వర్గీకరణ అనేది ముప్పయ్యేండ్ల ఉద్యమమే కాదు, అంతకుముందు ఇరవై ఏళ్లుగా నానుతున్న సమస్య. ఇది ఎస్సీ కులాల్లోని అసమానతలను రాజ్యాంగబద్ధంగా సమానంగా పంచుకునేందుకు కృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ, బ్రహ్మయ్య మాదిగ, కనకారావు మాదిగ, ఇంకా కొద్దిమంది మాదిగ యువత కలిసి 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' (ఎంఆర్‌పిఎస్) ఒంగోలు ఈదుమూడి నుంచి ఉద్యమంగా మొదలైంది. 59 ఎస్సీ కులాల్లో రిజర్వేషన్లని మాలలు దాని అనుబంధ కులాలే తొంబై శాతం పొందుతున్నాయని, అవి మాదిగ అణగారిన ఎస్సీ కులాల అందరికీ సమానంగా పంపకం జరగాలని మాదిగలు గత ముప్పై ఏళ్లుగా పోరాడుతున్నారు. కానీ ఎస్సీ కులాల రిజర్వేషన్లను ఎక్కువగా అనుభవిస్తున్న ఆధిపత్య ఎస్సీలు "ఇది దళిత ఐక్యతకు దెబ్బ అని, రాజకీయ పార్టీలు మమ్మల్ని విడదీస్తున్నారని, రాజ్యాంగ విరుద్ధమని అంబేద్కర్ సిద్ధాంతానికి వ్యతిరేకమ"ని కోర్టులకు పోయి వర్గీకరణ కాకుండా చేశారు.ఈ పరిస్థితుల్లో 2024 ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగ కులాలకు ఒక పెద్ద ఆశాదీపం. వర్గీకరణ రాజ్యాంగబద్ధమనీ, దేశమంతా సామాజిక, ఆర్థిక, విద్యా విషయాల్లో వ్యత్యాసం ఉందని, వర్గీకరణ రిజర్వేషన్ హక్కుల్లో భాగమనీ, ఆయా రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేసుకోవచ్చునీ స్పష్టంగా తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు ఉత్తర్వు వచ్చిన వెంటనే దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా ముందు తెలంగాణ సీఎం చేసిన అనుకూల ప్రకటన తెలంగాణ రాష్ట్ర మాదిగ, అనుబంధ కులాలు సామాజిక న్యాయ కాముకుల్లోనే కాక దేశవ్యాప్తంగా అనుకూల సందేశంగా వెళ్లింది. ఆ తర్వాత వర్గీకరణ అమలు కోసం జరగాల్సిన ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ వేయడం, ఆ కమిటీ కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ 1952 చట్టం ప్రకారం ఏకసభ్య కమిటీగా సీనియర్ జడ్జి షమీమ్ అక్తర్‌ని నియమించడం హర్షణీయం.ఈ ఏడాది ఫిబ్రవరి 2న కమిషన్ విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజికంగా అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాలని మొదటి గ్రూపుగా, మొదటి గ్రూప్ కంటే కొంత మెరుగైన కులాల్ని రెండవ గ్రూపుగా, విద్య%-%ఉద్యోగ%-%ఆర్థిక రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందిన కులాల్ని మూడవ గ్రూపులో చేర్చి నివేదిక సమర్పించింది. ఈ నివేదికను అసెంబ్లీ ఫిబ్రవరి 4న ఆమోదించి, ఆ తీర్మానాన్ని ఆర్టికల్ 338 ప్రకారం నేషనల్ ఎస్సీ కమిషన్‌కి పంపి, లీగల్ ప్రాబ్లమ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎందుకంటే 1997లో అసెంబ్లీలో చేసిన ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని నేషనల్ ఎస్సీ కమిషన్‌కి పంపించలేదనే కారణం చూపించి, ఇది రాజ్యాంగ విరుద్ధమని వర్గీకరణ వ్యతిరేకులు హైకోర్టులో పిటిషన్ వేసి కొట్టేయించారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ని, ఎస్సీ వర్గీకరణ నివేదికని అసెంబ్లీ ఆమోదించిన సమయాలను మాదిగ, దాని అనుబంధ కులాలు వేడుకలు చేసుకోవాల్సిన గొప్ప సందర్భం ఇది.కానీ 30 ఏళ్ల నుంచి వర్గీకరణ ఉద్యమంగా ఉంటూ పంపక న్యాయాన్ని అన్ని రాజకీయ పార్టీలను ఆలోచింపజేసిన దండోరా నాయకుడు 'మాల అనుబంధ కులాలకు ఒక పర్సెంట్, మాలలకు నాలుగు పర్సెంట్ చేయాలనడం, మూడు గ్రూపులు కాకుండా నాలుగు గ్రూపులు చేయాలని డిమాండ్ చేయడం ఎవరి ప్రయోజనాల కోసం? ఇంకా ఎస్సీ కులాల్లో ఎవరికీ అసంతృప్తి, ఆవేదన ఉండకుండా అందరికీ న్యాయం జరగాలనే వాదన మాదిగ, సహ కులాల సమాజాలు ఎలా అర్థం చేసుకోవాలి? ఎస్సీల్లో రిజర్వేషన్ పంపకాలు సమానంగా లేవనీ మాల, మాల అనుబంధ కులాలు ఎస్సీ రిజర్వేషన్లను తొంబై శాతం పొందుతున్నారని, రిజర్వేషన్లను పొందని, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో వెనకబడిన ఎస్సీ మాదిగ, మాదిగ సహ కులాలకు రాజ్యాంగబద్ధంగా పంపిణీ న్యాయం జరగాలని కదా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం వచ్చింది.ఇప్పుడు మాలలకు అదనంగా రాలేదనే అన్యాయ ఆవేదనకు, అసంతృప్తికి దండోరా నాయకుడు ఆసరా ఇవ్వడం వల్ల నష్టపోయేది ఎవరు? ఈ రోజు దాకా ఎస్సీ వర్గీకరణకు, ఎస్సీ సమానత్వాల వ్యతిరేక క్యాంపుగా ఉండి దశాబ్దాల తరబడి అడ్డుబడింది ఎస్సీల్లో ఎదిగిన మాల కులాలే కదా. 1997లో హైకోర్టులో, 1999 వర్గీకరణ అమలు చట్టాన్ని, 2004లో సుప్రీంకోర్టులో సాంకేతిక కారణాలు చూపించి అణగారిన ఎస్సీ కులాలకు రిజర్వేషన్లని దూరంబెట్టి అడ్డుకున్నవాళ్లు కూడా వీరే. ఆ అడ్డుపుల్లలు సరిపోలేదని ఈ మధ్య వర్గీకరణ అనుకూలమైన సుప్రీంకోర్టు జడ్జిమెంట్ మీద కూడా 32 రివ్యూ పిటిషన్లు వేసి క్యూరేటివ్ డిస్మిసల్స్‌తో వెనక్కి తగ్గారు. అర్ధ శతాబ్ద దండోరా పోరాటం, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఎస్సీ వెనకబడిన కులాల కోసమే గాని అభివృద్ధి చెందిన కులాల కోసం కాదు. కమిషన్ చేసిన మూడు గ్రూపుల్లో మాదిగలకు జరిగిన నష్టం పెద్దగా ఏమీ లేదు.ఎస్సీ కులాల్లో ఎవరికీ అసంతృప్తి, ఆవేదన ఉండొద్దు, అందరికీ న్యాయం జరగాలనడం, కమిషన్ గడువు పొడిగింపజేయడం వల్ల సమస్యను ఇంకా మానని పుండుగా జటిలం చేసే కథనే ఇది. ఒకసారి కమిషన్ ఇచ్చిన రిపోర్టు, అసెంబ్లీ ఆమోదం పొందిన నివేదికను మళ్లీ కాలపరిమితి పొడిగించి, సవరణలు చేయమని డిమాండ్ చేయడం అంటే రాజ్యాంగపరమైన చిక్కుల్ని తెచ్చుకోవడమే. దానివల్ల మాదిగ, చర్మకార కులాల వర్గీకరణ హక్కు మళ్లీ వెనక్కుపోయే ముప్పు పొంచి ఉన్నది. ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం రేపు వచ్చే లీగల్ సమస్యలన్నీ పక్కనపెట్టి కమిషన్‌ని పొడిగించడానికి అనుమతించింది. ఇది అవకాశంగా తీసుకుని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులు సుప్రీంకోర్టు చెప్పిన 'రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టం వచ్చినట్లు వర్గీకరణ చేయరాదు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం వర్గీకరణ చేస్తే తిరిగి సమీక్షిస్తాం. అవసరం ఉంటే కొట్టేస్తాం' ఈ స్టేట్‌మెంట్‌ని అవకాశంగా తీసుకొని రేపు వర్గీకరణ వ్యతిరేకులు కోర్టుకెడితే సమస్య వెనక్కొచ్చి ఎప్పటి చిప్ప యెనుగులనే మిగుల్తది. తస్మాత్ జాగ్రత్త!

# సరైన సమయమిదే.. రాజీనామా చేయండి!



స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి తగిన సమయం అంటే ఎంతకాలం? దానికో పరిమితి, పద్ధతి లేదా? అని సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు ప్రశ్నిస్తున్నా బాధ్యులైన అసెంబ్లీ అధికారులు, వారి తరఫున వాదిస్తున్న దిగ్గజ న్యాయవాదులు రకరకాల సాంకేతిక అభ్యంతరాలను ముందుకుతెచ్చి కాలయాపన చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నది.తెలంగాణలో గత ఏడాదిగా ప్రజల్లో, పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో, న్యాయస్థానాల్లో నలుగుతున్న 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు వివాదం ఇంకా సాగదీయకుండా గౌరవప్రదంగా ముగించాలంటే ఆ పది మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలి. వెంటనే స్పీకర్ వాటిని ఆమోదించాలి. లేదా వారి సభ్యత్వాలను ఫిరాయింపు చట్టం కింద రద్దు చేయాలి. భారతదేశ చట్టసభల్లో ఫిరాయింపుల చరిత్రలో అత్యున్నత న్యాయస్థానం ఒక అసెంబ్లీ స్పీకర్ కాలాతీత నిర్ణయాధికారంపై ఇంతగా పదే పదే అసహనం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి.రేవంత్ రెడ్డి పరిపాలన పట్ల పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి ప్రజల ముందుకు వచ్చి ఉప ఎన్నికల్లో గెలిచే సాహసం చేయలేని దీనస్థితి దాపురించింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వారిని మరింత నిరాశకు గురిచేశాయి. మరోవైపు నెత్తిపై అనర్హత కత్తి వేలాడుతూనే ఉన్నది. వారి పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి. భవిష్యత్తు అగమ్య గోచరమైన నేపథ్యంలో కొందరు తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకోవడానికి రాయబారాలు నడుపుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి తగిన సమయం అంటే ఎంతకాలం? దానికో పరిమితి, పద్ధతి లేదా? అని సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు ప్రశ్నిస్తున్నా బాధ్యులైన అసెంబ్లీ అధికారులు, వారి తరఫున వాదిస్తున్న దిగ్గజ న్యాయవాదులు రకరకాల సాంకేతిక అభ్యంతరాలను ముందుకుతెచ్చి కాలయాపన చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. శిరస్సు వంచి దేశం నమస్కరించవలసిన అత్యున్నత న్యాయస్థానంతో దోబూచు లాడుతున్న వారి జిత్తులమారితనం అవగతమవుతున్నది. ఈ కేసు ద్వారా అత్యున్నత న్యాయస్థానం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించి, సత్సంప్రదాయాన్ని నెలకొల్పే దిశగా ఒక చారిత్రాత్మకమైన తీర్పునిస్తుందన్న ఆశాభావం ప్రజల్లో ప్రజాస్వామికవాదుల్లో వ్యక్తమవుతున్నది.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీచేసి పార్టీ కార్యకర్తల కష్టంతో ప్రజల ఆమోదంతో గెలిచి వేలికంటించిన నల్ల సిరాచుక్క ఆరకముందే పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, దానం నాగేందర్, ఎం.సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, టి.ప్రకాశ్ గౌడ్, బండ్ల కృష్ణ మోహనరెడ్డి, తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్య అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం, కండువాలు కప్పుకోవడం ప్రజలంతా చూశారు. స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ వేగం పుంజుకొన్న తరుణంలో న్యాయస్థానం కళ్లు కప్పడం కోసం నేనింకా బీఆర్ఎస్ అని ఒకరు, కప్పింది కాంగ్రెస్ కండువా కాదు దేవాలయ శేష వస్త్రమని మరొకరు, అనుమతి లేకుండానే తన ఫొటోలు కాంగ్రెస్ ఫ్లెక్సీలలో ముద్రిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినదొకరు, ఎక్కడ వీడియోలో దొరికిపోతామోనన్న భయంతో గాంధీభవన్ సీఎల్పీ సమావేశాలకు దూరంగా ఉండేది ఒకరు, ఏకంగా కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి కూడా అంతా ఉత్తిదే అంటున్నది ఇంకొకరు.ప్రభుత్వ సలహాదారునైనా పార్టీ మారలేదని వేరొకరు ఇలా ఒకటా, రెండా? ఫిరాయింపు ఎమ్మెల్యేలు వేయని పిల్లి మొగ్గలు లేవు. గతంలో ఎన్నో పార్టీ ఫిరాయింపులు జరిగాయి. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వెళ్లినా కండువాలు కప్పుకోలేదు. పదవులు తీసుకోలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చట్ట ప్రకారమే టీడీపీ, కాంగ్రెస్ శాసనసభాపక్షాలు బీఆర్ఎస్‌లో విలీనమయ్యాయి. కానీ, ఇంత నిస్సిగ్గుగా ఫిరాయింపు నాటకాలకు తెర తీసిన సందర్భం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 39 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో 26 మంది కాంగ్రెస్‌లో చేరి ఉంటే అది ఫిరాయింపు అయ్యేది కాదు. చట్ట ప్రకారం బీఆర్ఎస్ సభ్యులు కాంగ్రెస్‌లో విలీనమైనట్టుగా భావించేవారు. వివాదానికి ఆస్కారం ఉండేది కాదు. గేట్లు తెరిస్తే అది సాధ్యమేనని కాంగ్రెస్ కాకి లెక్కలు వేసుకున్నది. కానీ అతి కష్టం మీద చేరింది పదిమంది. ఫలితంగా కాంగ్రెస్ పార్టీ బోనులో నిలబడింది.'బీఆర్ఎస్ పనైపోయింది. మిగిలింది మేమే' అని జబ్బలు చరుచుకుంటున్న కాంగ్రెస్, ప్రకటించిన పథకాలన్నీ తమ రాష్ట్రంలో అమలుపరుస్తున్నామంటూ పక్క రాష్ట్రాలలో ప్రవచనాలు వల్లిస్తున్న కాంగ్రెస్ పది మందితో రాజీనామా చేయించి ఎన్నికలకు పోయి ప్రజల తీర్పు కోరవచ్చు కదా? గెలిచి చూపించి ప్రభుత్వం పట్ల ప్రజామోదానికి అదే నిదర్శనమని ఢంకా బజాయించుకోవచ్చు కదా. ఒకవేళ పదిమందీ ఓడిపోయినా ప్రభుత్వానికి వచ్చే ఇబ్బందేమీ లేదు. న్యాయస్థానం ముందు తలవంచే పరిస్థితి రాదు. భయమెందుకు? ప్రధానిగా రాజీవ్‌గాంధీ తెచ్చిన పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టానికి ఈ 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అనుగుణంగానే ఉన్నదని ఆ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రకటించగలరా? ఐదేండ్ల కిందట చట్టబద్ధంగానే బీఆర్ఎస్‌లో చేరిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనీయనని భీషణ ప్రతిజ్ఞ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు చట్ట విరుద్ధంగా కాంగ్రెస్‌లో చేరిన ఈ 10 మందికి స్వాగత ద్వారాలు ఎలా తెరిచినట్టు? ఫిరాయింపులు మరింత విచ్చలవిడిగా జడలు విప్పకుండా కళ్లెం వేసే శక్తి ఒక న్యాయస్థానాలకే ఉన్నది. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఓడిపోయిన అభ్యర్థి న్యాయస్థానాలను ఆశ్రయిస్తే అవును నిజమే అనే లోపు గెలిచిన అభ్యర్థి పదవీకాలం పూర్తయిన సందర్భాలున్నాయి. అలాగే స్పీకర్ కాలయాపన వల్ల ఫిరాయింపుదారులు పబ్బం గడుపుకొంటున్న సందర్భాలు చూస్తూ ఉన్నాం. స్పీకర్‌కు ఉన్న నిరపేక్షమైన విచక్షణాధికారాలపై మరింత చర్చ జరగాలి. స్పీకర్ నిర్ణయానికి తగిన సమయం కాదు, నిర్ణీత సమయం ఉండాలి. ఈ ద్రవిడ ప్రాణాయామాలు, డొంక తిరుగుడు వ్యవహారాలు వద్దనుకుంటే చట్టసభల సభ్యుడు ఫిరాయించిన రోజే సభ్యత్వం రద్దు కావాలి. అందుకు కేంద్రం చొరవ చూపాలి.ముక్తాయింపు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ టికెట్ ఆశించిన పొన్నాల లక్ష్మయ్యను ఉద్దేశించి నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చాలా పరుషంగా మాట్లాడారు. 'ముసలితనానికి ఇదేం పో యేకాలం. పార్టీ నీకేం తక్కువ చేసింది. సిగ్గుండాలి' అంటూ తిట్టిపోశారు. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన వయోధిక నాయకత్రయాన్ని అట్లాగే తిట్టిపోసి వెనక్కి పంపిస్తే రేవంత్ రెడ్డికి ఎంతో గౌరవం దక్కేది కదా.

# పతనం మొదలైంది !

కాంగ్రెస్ పార్టీ నేత టి.జీవన్‌రెడ్డి ప్రా తినిధ్యం వహించిన ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబా ద్ పట్టభద్రుల నియోజకవర్గం ఇప్పుడు బీజేపీ వశమైంది. ఎంతో నాటకీయంగా సాగిన ఈ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి చివరికి ఓటమి పాలు కాక తప్పలేదు.2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణలో వచ్చిన ఏ ఎన్నికల్లోనూ పాలకపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ తన శక్తిని నిరూపించుకోలేకపోయింది.చేతిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండి కూడా మే 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ సగం స్థానాల వద్దే నిలిచిపోయింది. దాంతో ఆ పార్టీకి ఎన్నికలంటేనే భయం పట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికలను ఏడాదికి పైగా దాటవేస్తున్నది. కాంగ్రెస్ పాలనపై, హామీల అమలుపై అసంతృప్తితో ఉన్న ఓటరును బీసీ రిజర్వేషన్లతో చల్లబరిచి స్థానిక సంస్థల్లో గట్టెక్కాలని చూస్తున్నది. అయితే ఈ మధ్య వచ్చిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింటిని బీజేపీ తన్నుకుపోవడంతో ఓటర్ల దృష్టిలో కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారిందనక తప్పదు.కాంగ్రెస్ పార్టీ నేత టి.జీవన్‌రెడ్డి ప్రా తినిధ్యం వహించిన ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబా ద్ పట్టభద్రుల నియోజకవర్గం ఇప్పుడు బీజేపీ వశమైంది. ఎంతో నాటకీయంగా సాగిన ఈ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి చివరికి ఓటమి పాలు కాక తప్పలేదు. గెలుపుపై ఎంతో నమ్మకాన్ని పెట్టుకున్న ఆయన ఫలితాన్ని చూసి కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు బయటపడ్డాయి. ఆయనపై ఐదు వేల ఓట్ల ఆధిక్యంతో సంగారెడ్డికి చెందిన బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపొందారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ ఈ సీటును ప్రతిష్ఠాత్మకంగానే పరిగణించింది. ముఖ్యమంత్రి, టీ కాంగ్రెస్ అధ్యక్షుడు, మంత్రులు అందరూ నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన వెంట ఉన్నారు. ఒక్క ఎమ్మెల్సీ సీటు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. పెద్దపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వ తీరును వివరించి ఓట్లడిగారు. అయితే కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ ఎన్నికల ఫలితాల రూపంలో మరోసారి బయటపడింది.నిజానికి ఈ ఎన్నికలో అభ్యర్థి ఎంపికపైనే కాంగ్రెస్ వైపు నుంచి తప్పటడుగు పడిందనాలి. విద్యా వ్యాపారంలో ఉన్న వి.నరేందర్ రెడ్డి ఆల్ఫోర్స్ అనే సంస్థకు అధిపతి. తన సంస్థ వ్యాప్తి, వ్యాపార విస్తరణ పట్ల తప్ప ఆయనలో సేవా కోణం లేదు. చేతి నిండా డబ్బున్న ఆయన రాజకీయంగా ఎదగాలని కోరుకోవడం వ్యక్తిగత కాంక్ష మాత్రమే. స్థితిమంతుడైన, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బీజేపీ నిలబెడుతున్నందువల్ల ఆయనకు తూగే వ్యక్తిగా స్థానికుడైన మరో రెడ్డిని కాంగ్రెస్ ఎంపిక చేసింది. ఇక్కడే కాంగ్రెస్ చిత్తశుద్ధి బయటపడింది. బీసీలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొంటున్న కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో మాత్రం బీసీలను పక్కనపెడుతున్నది. ఇక్కడ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమైన ప్రసన్న హరికృష్ణ గురించి ప్రస్తావించుకోవాలి. గజ్వేల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి ఎమ్మెల్సీ బరిలో దిగారు. అప్పటికే విద్యార్థుల, విద్యాలయాల సమస్యలపై ప్రభుత్వానికి ఎన్నో వినతులు సమర్పించారు. సంబంధిత మంత్రులను కలిసిన ఫొటోలు, వార్తలు ప్రచారంలో కనబడ్డాయి. కోటీశ్వరులతో ఓ సాధారణ పౌరుడిగా పోటీపడ్డారు. ఆయనకు 60,419 ఓట్లు వచ్చాయి. బలమైన రాజకీయ పార్టీ మద్దతు లేకుండా ఇన్ని ఓట్లు సాధించడం గొప్ప విషయమే. ఓటరుకు ఒక్క రూపాయి కూడా పంచకుండా ఈ ఓట్లు సంపాదించానని ఆయన అంటున్నారు. ఇలాంటి అభ్యర్థులు మన ప్రధాన రాజకీయ పార్టీలకు కనబడరు. ఎన్నికలనగానే ఎంత ఖర్చుపెడతాడు, పార్టీకి ఎంతిస్తాడు అనే లెక్కలే వాటికి ప్రధానం. ఇక్కడ కాంగ్రెస్ ఒక మంచి అవకాశాన్ని వదులుకొని రాష్ట్రంలో బీజేపీ బలపడటానికి తోడ్పడిందనక తప్పదు.

### అసలు ఎమ్మెల్సీలంటే ఎవరు?

ప్రభుత్వంలో ఎగువసభ అవసరమేమిటి? రాజకీయ నాయకులతో ఎన్నికల్లో పోటీ పడే అంగ, అర్థబలం లేని మేధావులు, విద్యావంతులు, కళాకారులు, సమాజ సేవకులు పాలనలో భాగం కావాలని, వారి జ్ఞానసంపత్తిని విధాన నిర్ణయాల్లో వినియోగించుకోవాలని 'శాసన మండలి' ఏర్పడింది. ఎందరో మహానుభావులు మండలి సభ్యులుగా ప్రజలకు తమ సేవలందించారు. పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులు, ఉన్నత విద్యావంతులైన పట్టభద్రులు సమాజానికి అవసరమని, వారి ప్రతినిధులు




మండలిలో ఉంటే ప్రభుత్వానికి తగిన సూచనలు చేయగలరని కొన్ని ఎమ్మెల్సీ సీట్లు వారికి కేటాయించారు. తెలంగాణ విధాన మండలిలో ఉన్న 40 సీట్ల లో మూడేసి సీట్లు పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు కేటాయించారు. వాటిలో ఒక పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయుల సీట్ల పదవీకా లం మార్చి 29తో ముగుస్తుంది. ఈ నియోజకవర్గాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరిగాయి. ఒక ఉపాధ్యాయ స్థానానికి అధ్యాపకుడైన పీఆర్‌టీయూ అభ్యర్థి గెలవగా మిగతా రెండింటి లో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. గతంలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెద క్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రతినిధి ఒక ఉపాధ్యాయుడు కాగా ప్రస్తుతం బీజే పీ తరఫున గెలిచిన మల్కా కొమురయ్య ఓ బిజినెస్ మాన్. పల్లవి విద్యాసంస్థల యజమా ని. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనకు మల్కాజ్‌గిరి స్థానాన్ని ఇవ్వలేకపోయిన బీజేపీ ఇలా ఇప్పుడు భర్తీచేసింది. ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఓటరుగా పేరు నమోదు చేసుకోవడానికి కనీసం మూడేండ్లు ఉన్నత, ఆపై పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం కావాలి. పోటీ చేయడానికి మాత్రం అలాంటి అర్హతతో పనిలేదు. వృత్తి గురించి ఓనమాలు తెలియని వ్యక్తి వారి తరఫున చట్టసభకు వెళ్లి ఏం మాట్లాడుతారో మరి.కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ స్థానానికి తమ అభ్యర్థిని నిలబెట్టిన కాంగ్రెస్ మిగతా రెండు చోట్ల అభ్యర్థులు దొరకక, ఎవరికీ మద్దతు ఇవ్వక మౌనంగా ఉండిపోయింది. పాలకపక్షానికి ఇలాంటి పరిస్థితి రావడం ఇప్పుడే చూస్తున్నాం. సాధారణంగా ఉపాధ్యాయ, పట్టభద్ర స్థానాలకు స్వతంత్రులు, యూనియన్ నాయకులు గెలుస్తుంటారు. అయినా పాలించే పార్టీ తమ ప్రయత్నం మానుకోదు. గతంలో బీఆర్ఎస్ రెండు పట్టభద్రుల స్థానాల్లో సురభి వాణీదేవి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలను గెలిపించుకున్నది. ఈసారి మాత్రం ఉపాధ్యాయ స్థానం సంఘ నాయకుల చేతిలోంచి ఒక వ్యాపారి చేతిలోకి వెళ్లింది. పార్టీలేవైనా విధాన మండలి ఖాళీలకు కొన్ని నియమాలు పాటించాలి. ఆయా రంగాల్లో విశేష కృషిచేస్తున్న వారికే ఆ సీట్లు కేటాయించడం గౌరవప్రదంగా ఉంటుంది. డాక్టర్లు, లాయర్లు లాంటి ఏ వృత్తికీ ఇవ్వని ప్రత్యేక స్థానం ఉపాధ్యాయులకు రాజ్యాంగం ఇచ్చింది. శాసనమండలిలో అడుగుపెట్టే అర్హత గురువులకే పరిమితం చేయాలి.

# వికటించిన న్యాయం

వందేళ్ళ చరిత్ర ఉన్న తమిళ మీడియా సంస్థ వికటన్‌కు మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం దక్కింది. ఈ మ్యాగ్‌జైన్ వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాల్సిందిగా వందేళ్ళ చరిత్ర ఉన్న తమిళ మీడియా సంస్థ వికటన్‌కు మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం దక్కింది. ఈ మ్యాగ్‌జైన్ వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ఏ కార్టూన్ కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆగ్రహంతో సదరు సంస్థ వెబ్‌సైట్‌ను బ్లాక్‌చేసిందో, ఆ కార్టూన్‌ను తీసివేయాలన్న ముందస్తు షరతు ఇందులో ఉంది. షరతుకు అంగీకరించిన పక్షంలోనే, సదరు వెబ్‌సైట్ మళ్ళీ తెరమీద ప్రత్యక్షమవుతుందన్న ఈ ఆదేశాలు మధ్యంతరం కావచ్చును, అంతిమతీర్పు మిగిలే ఉండవచ్చు. కానీ, న్యాయస్థానం ఇలా అతిజాగ్రత్తగా వ్యవహరించడం మిగతా మీడియా సంస్థలకు ఉత్తేజాన్నిచ్చే అంశమైతే కాదు.అక్రమవలసదారులంటూ కాళ్ళకూ చేతులకూ గొలుసులు కట్టి, మొఖానికి మాస్కులు పెట్టి అమెరికా తన విమానాల్లో మన పౌరులను పంజాబ్‌లో దించేసినందుకు దేశం యావత్తూ బాధపడింది, అవమానపడింది. ఇంత అమానుషంగా, అగౌరవంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించకపోతే ఎలా? అని విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి. ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదని తప్పుబట్టాయి. ఆవేదనని అమెరికా సర్కారుకు తెలియచేశామని, అయితే, అక్రమార్కులను అలా గొలుసులు కట్టి పంపడం వాళ్ళ విధానమని మన ప్రభుత్వం వ్యాఖ్యానించింది. ఈ వివరణ మన పరువు మరింత దిగజార్చేట్టు ఉన్నదని మళ్ళీ విపక్షాలు తప్పుబట్టాయి. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ అమెరికా పర్యటన జరిగింది. భేటీలో ఈ అంశాన్ని మోదీ ప్రస్తావించకపోవడంపైన కూడా విమర్శలు వచ్చాయి. ట్రంప్ పక్కనే మోదీ గొలుసులతో కూర్చుని ఉన్న ఈ కార్టూన్ తమిళనాడు బీజేపీ అధినేత అన్నామలైకి ఆగ్రహం కలిగించింది. వికటన్ మ్యాగజైన్ డీఎంకేకు ప్రచారసాధనంలాగా తయారైందని, ప్రధానికి వ్యతిరేకంగా నిరాధారమైన కథనాలు ప్రచురిస్తోందని ఆయన ఓ ఫిర్యాదు సంధించారు. అది ఢిల్లీ చేరిన కొద్దిగంటల్లోనే సదరు సంస్థ వెబ్‌సైట్, దాని యాప్‌లు పనిచేయడం మానేశాయి. కార్టూన్ ఫిబ్రవరి 10న ప్రచురితమైతే, ఐదురోజుల అనంతరం కేంద్రప్రభుత్వం తన వెబ్‌సైట్ బ్లాక్ చేసిందనీ, ఫిబ్రవరి 25వరకూ తనకు అధికారికంగా సమాచారమివ్వలేదని వికటన్ వాదన.కార్టూన్ మంచిచెడ్డలను అటుంచితే, వందేళ్ళ చరిత్ర ఉన్న ఒక సంస్థకు చెందిన వెబ్‌సైట్ మూసేయాలని కేంద్ర ప్రభుత్వం అంతవేగంగా ఎలా నిర్ణయానికి రాగలిగిందో అర్థంకాదు. ఫిర్యాదులో బలంకంటే, ఫిర్యాదిదారు బలవంతుడు కావడం వల్ల కాబోలు భావప్రకటనా స్వేచ్ఛలు, హక్కులు పక్కకు పోయి, కొద్ది గంటల్లోనే ఎదుటిపక్షానికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా మ్యాగజైన్‌ను మూసేశారు. ఈ కార్టూన్ దేశప్రయోజనాలకు వ్యతిరేకమైనదని నిర్ధారించి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదా, లేక ఆనందవికటన్ సంస్థ ప్రత్యర్థి పార్టీకి అనుకూలమనీ, బీజేపీకి వ్యతిరేకమని అన్నామలై చేసిన ఆరోపణతో ఏకీభవించి జరిగిందా?కేంద్రం నిర్ణయం భావప్రకటనాస్వేచ్ఛకు వ్యతిరేకమని, ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత చర్య అనీ ఎడిటర్స్ గిల్డ్ నుంచి తమిళనాడులోని అన్ని మీడియా సంస్థల వరకూ విమర్శించాయి. ఆ కార్టూన్ భావప్రకటనా స్వేచ్ఛ పరిమితుల్లోనే ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది సమర్థించారు, ఇది విదేశాలతో మనకున్న బలమైన బంధాలను దెబ్బతీస్తుందని న్యాయస్థానంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ వాపోయారు. మంచీచెడూ తేల్చేలోగా ఇచ్చిన ఈ తాత్కాలిక తీర్పులో సమపాళ్ళలో న్యాయం చేస్తున్నట్టు న్యాయమూర్తికి అనిపించి ఉండవచ్చు. కానీ, కేంద్రానికి నచ్చని కార్టూన్‌ని తీసివేయమని చెప్పడం ద్వారా ఆ నియంత్రణను సమర్థించినట్టే అ?యింది. విచారణ కొనసాగుతుందనీ, వెంటనే వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాల్సిందేనని ఆదేశించివుంటే బాగుండేది. తద్వారా ఎటువంటి వివరణలు అడగకుండా, ఏకపక్షంగా, కేంద్రం తీసుకున్న ఆ నిర్ణయాన్ని ప్రశ్నించినట్టూ అయ్యేది. కార్టూన్‌ను తొలగించాల్సిందిగా ఆదేశించి, అందుకు సదరు సంస్థ నిరాకరించినపక్షంలో నిర్దిష్టమైన ప్రక్రియను అనుసరించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉన్నది. ఈ కార్టూన్ ద్వారా చేసిన రాజకీయ విమర్శతో అమెరికాలో మనదేశం పరువుపోతుందనీ, ఆ దేశంతో మన సంబంధాలు దెబ్బతింటాయన్న వాదనతో ఏకీభవించడం కష్టం. డోనాల్డ్ ట్రంప్ చర్యలూ చేష్టలమీద అక్కడి మీడియాలో ఎటువంటి విశ్లేషణలు, వ్యాఖ్యలు, కార్టూన్లు వస్తున్నాయో, అవి ఎంత ఘాటుగా ఉంటున్నాయో మన పాలకులు ఒకసారి గమనిస్తే బాగుంటుంది.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

శనివారం 08 - 03 - 2025

# స్వీట్ చేంజ్.. విందులో పసందైన రుచులు



ఏదైనా శుభవార్త చెప్పే ముందు నోరు తీపి చేస్తారు. ఇది ఒకప్పటి మాట. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది.. ప్రతి చిన్న విషయానికీ స్వీట్‌తో పండుగ చేసుకుంటున్నారు. అంతేనా! అంటే కాదు..కొందరు భోజనానికి ముందు.. కొందరు భోజనానికి తర్వాత కూడా స్వీట్ తినే అలవాటు చేసుకుంటున్నారు. ఈ అలవాటుకు అనుకూలంగా నగరంలోని పలు రెస్టారెంట్స్, హోటల్స్ ఫుడ్ సర్వ్ చేసేటప్పుడు చివరి వంటకంగా డిసర్ట్స్ సర్వ్ చేస్తున్నారు. స్టార్టర్స్, మెయిన్ కోర్సు వగైరాలన్నీ పూర్తయ్యాక ఫైనల్‌గా అందించే తీపి కబురు కోసం ఫుడ్ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీటిని తరచూ మారుస్తూ చెఫ్స్ కూడా ఆ ఆసక్తిని సజీవంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు మిఠాయి అంటే స్వీట్ షాప్ మాత్రమే గుర్తొచ్చే నగరవాసులు.. ఇప్పుడు కొన్ని రకాల డిసర్ట్స్‌ను ఎంజాయ్ చేసేందుకు రెస్టారెంట్స్‌కు క్యూ కడుతున్నారు.భోజనం అయిపోగానే కాస్తంత తీపి రుచిని ఆస్వాదించడం చాలా కాలంగా ఒక సంప్రదాయంగా స్థిరపడింది. ఇప్పుడు ఆ సంప్రదాయం ఇంతింతై వటుడింతై అన్నట్లు.. రెస్టారెంట్స్ వడ్డించే విందులో డిసర్ట్స్‌ని అత్యంత ప్రాధాన్యత కలిగిన భాగంగా మార్చేసింది. మిఠాయిలు ఆస్వాదించాలంటే కేవలం స్వీట్ షాప్స్ మాత్రమే శరణ్యం అనే పరిస్థితి మారి కేవలం డిసర్ట్స్ కోసం రెస్టారెంట్స్‌కి వెళ్లడం ఇప్పుడు సాధారణంగా మారింది.

**జామ్.. బూమ్..**

రెస్టారెంట్ల తొలినాళ్లలో గులాబ్ జామ్ వంటి అందరికీ తెలిసిన స్వీట్లను మాత్రమే వడ్డించేవారు. అయితే ఆ తర్వాత క్రమంలో పూర్తి భోజనాన్ని మూడు భాగాలుగా విభజించిన తర్వాత డిసర్ట్స్ పేరుతో మెనూలో ప్రత్యేక స్థానాన్ని తీపి వంటకాలకు కేటాయించారు. తొలినాళ్లలో గులాబ్ జామ్, హల్వా, జిలేబీ, రస్‌మలాయ్, కోవా మాత్రమే చాలాకాలం డిసర్ట్స్‌గా రాజ్యమేలాయి. అయితే మల్టీ క్యుజిన్‌ల వెల్లువ ధాటికి మెయిన్ కోర్సుతో పాటు డిసర్ట్స్ కూడా విభిన్న రుచులకు విస్తరించాయి. ఒకప్పుడు ఆరు వెరైటీల దగ్గర నుంచి ఇప్పుడు అతిథులకు తీపి రుచులను పెద్ద సంఖ్యలో లంచ్, డిన్నర్‌లలో వడ్డిస్తున్నారు.

**బేకరీ ఉత్పత్తులకూ చోటు..**

తొలుత అందరికీ బాగా తెలిసిన ప్రాంతీయ తీపి వంటకాలు ఆ తర్వాత పేస్ట్రీలకు కూడా డిసర్ట్స్ స్టైల్ మారుతూ వచ్చింది. రస్‌మలాయ్‌కి బదులు అదే ఫ్లేవర్‌లో ఐస్‌క్రీమ్ పెడుతున్నారు. బఫేలో కాంటినెంటల్ చీజ్ కేక్, బ్రౌనీ, చాకోలావా, మథుపై.. ఇలా బేకరీ ఐటమ్స్ కూడా భాగం చేస్తున్నారు. కొంత కాలంగా ఐస్‌క్రీమ్ కూడా డిసర్ట్స్‌లో తప్పనిసరి భాగం అయిపోయింది. ఐస్‌క్రీమ్‌కి కాంబినేషన్‌గా గులాబ్‌జామ్/పేస్ట్రీస్/ మూంగ్‌దాల్ హల్వా వంటివి అతిథుల నోరూరిస్తున్నాయి. కొన్నిచోట్ల సంప్రదాయ వంటకాలైన ఖద్దూ కా ఖీర్, ఫ్రూట్ కస్టర్డ్.. సేమియా పాయసం, సగ్గుబియ్యం పాయసం, పూర్ణాలు, బొబ్బట్లు కూడా వడ్డిస్తున్నారు.

**ఆరోగ్య 'తీపి'..రస్తు..**

ఇటీవల ప్రారంభమైన ఆరోగ్యకరమైన వంటకాల ప్రభావం రెస్టారెంట్స్ మీద కూడా పడింది. దీనిలో భాగంగా కొత్తగా పరిచయమైన మిల్లెట్స్‌తో తయారైన తీపి వంటకాలను అతిథులకు అందిస్తున్నారు. కొర్రల పరమాన్నం, జవారి లడ్డు, రాగుల పాయసం, ఊదల లడ్డు, సామల పరమాన్నం.. వంటివి నెమ్మదిగా విస్తరిస్తున్నాయి. ఇవన్నీ పంచదార కాకుండా తృణధాన్యాలు, బెల్లంతో తయారవడం డయాబెటిక్ రోగులకు కూడా పెద్దగా హానికారకం కాకపోవడంతో వీటి పట్ల నగరవాసుల్లో మోజు పెరిగిందని చెఫ్ యాదగిరి చెబుతున్నారు. ఆయా సీజన్లలో వచ్చే పండ్లను ఉపయోగించి తయారు చేసే సీజనల్ డిసర్ట్స్ కూడా రెస్టారెంట్స్‌లో సందడి చేస్తున్నాయి. సీతాఫలం దొరికే సీజన్లో సీతాఫల్ రబ్డీ, ప్రస్తుతం జామకాయలు విరివిగా దొరుకుతాయి కాబట్టి జామూన్ డిలైట్ ఇలా ఆయా సీజన్స్ ప్రకారం కొత్త రుచులను అందిస్తున్నారు. అలాగే మల్‌బరీ పండ్లు విరివిగా లభించే సమయంలో ఐస్‌క్రీమ్ మల్‌బరీస్ మిక్స్, మల్‌బరీ జ్యూస్ వంటివి అందిస్తున్నారు.

# హాలో హాలీమ్.. చలో తినేద్దాం..

నగరంలో రంజాన్ మాసం అంటే ఆధ్యాత్మికతకు నెలవు. అయితే రుచుల ప్రియులకు అది హాలీమ్‌కు కొలువు. రద్దీ బజార్ల నుంచి సందు గొందుల దాకా తినుబండారాల స్టాల్స్ నుంచి లగ్జరీ ఫైన్‌డైనింగ్ రెస్టారెంట్ల వరకు, ఎందెందు వెదకినా.. అందందే హాలీమ్ ఘుమఘుమలు గుబాళిస్తూ ఉంటాయి. నగరవాసులకు మాత్రమే కాదు విదేశాలకు సైతం ఎగుమతి అయ్యే సిటీ హాలీమ్‌ను అందించడంలో స్పెషల్‌గా నిలవాలని తయారీదారులు పోటీపడుతుంటారు. కొందరు తమ సంప్రదాయ తయారీ పద్ధతులకు కట్టుబడి ఉంటారు, మరికొందరు సమకాలీన రుచులతో ప్రయోగాలు చేస్తారు. పలువురు ఫుడ్ లవర్స్‌ను ఫ్యాన్స్‌గా మార్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఆదరణ పొందిన టాప్ 10 హాలీమ్ స్పాట్స్ విశేషాలివి..

**భలే 'సర్వీ'స్..**

ప్రముఖ రెస్టారెంట్.. సర్వి గత కొంతకాలంగా అత్యంత ఆదరణ పొందుతున్న హాలీమ్‌కు కేరాఫ్‌గా ఉంది. ఈసారి చికెన్ 65, ఉడికించిన గుడ్డు, జీడిపప్పు, క్రీమ్‌లతో కూడిన ప్రత్యేక ఇరానీ హాలీమ్‌ను అందిస్తున్నారు. మాసాబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, మాదాపూర్, సికింద్రాబాద్‌లలో సర్వి రెస్టారెంట్స్ ఉన్నాయి.

**'వజ్రం'లా..**

హోటల్ సిటీ డైమండ్ హాలీమ్ ప్రియుల ఫేవరెట్ ప్లేస్‌గా పేరొందింది. నెయ్యితో తయారైన వీరి హాలీమ్ సుగంధ మిశ్రమాన్ని కలిగి ఉంటుంది. దీనిని సంప్రదాయ భట్టిలో వండుతారు.

**హుషార్.. పెషావర్..**

ప్రత్యేక టాపింగ్స్ లేని హాలీమ్‌ను ఇష్టపడే వ్యక్తులకు, పెషావర్ సరైన ప్లేస్. గత కొన్ని సంవత్సరాలుగా సువాసన గల హాలీమ్‌తో హైదరాబాదీలను ఆకట్టుకుంటోన్న పెషావర్ లక్డీకాపూల్, మలక్‌పేట్‌లో ఉంది.

**వహ్వా.. అని'పిస్తా'..**

నగరవాసులు అత్యంత ఇష్టపడే పిస్తా హౌస్ ప్రస్తావన లేకుండా హైదరాబాద్ హాలీమ్ పండుగ ఉండదు. ప్రతి ఏటా మాంసం, మసాలాతో కూడిన హాలీమ్‌తో తనదైన రుచిని పిస్తా హౌస్ అందిస్తుంది. నగరంలో దాదాపు ప్రతీ ప్రధాన ఏరియాలో పిస్తా హౌస్‌లు ఉన్నాయి.

**మది దోచే.. మందార్**

అచ్చమైన సంప్రదాయ పద్ధతులను ఉపయోగించి వండే హాలీమ్‌కు మందార్ పేరొందింది, కాసింత ఇంటిశైలి రుచిని ఇష్టపడేవారికి కరెక్ట్ ప్లేస్. ఈ హాలీమ్‌ను రుచి చూడాలంటే టోలీచౌకిలోని మందార్‌ను సందర్శించాల్సిందే.

**ట్రిపుల్ 'ఫై'న్..**

ఫ్యూజన్ హాలీమ్‌కు ప్రసిద్ధి చెందింది కేఫ్ 555.. చికెన్ 65, నల్లి ఘోష్ట్, తలవా ఘోష్ట్, ఉడికించిన గుడ్డు లేదా క్రీమ్ వంటి విభిన్న టాపింగ్స్‌తో వెరైటీ రుచులను అందిస్తుంది మాసాబ్ ట్యాంక్‌లో ఉన్న ఈ కేఫ్.

**సుభాన్.. మహాన్..**



ఉస్మానియా బిస్కెట్‌ల సృష్టికర్త సుభాన్ బేకరీ రెండేళ్ల క్రితం హాలీమ్ వ్యాపారంలో అడుగు పెట్టింది. స్వల్పకాలంలోనే నగరవాసుల మనసులను గెలుచుకుంది. నాంపల్లి, అత్తాపూర్ ప్రాంతాలలో ఈ బేకరీ ఉంది.

**గ్రిల్.. భారీ థ్రిల్..**

బాహుబలి హాలీమ్‌తో ప్రత్యేకంగా గుర్తింపు పొందింది గ్రిల్(3 ప్లేట్ల హాలీమ్, ఉడికించిన గుడ్లు, చికెన్ 65, పత్తర్ కా ఘోష్ట్, నల్లి, వేయించిన ఉల్లిపాయలు, జీడిపప్పు, బాదం క్రీమ్)తో కూడిన హాలీమ్‌లను వడ్డిస్తూ ఫుడ్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ హాలీమ్ టేస్ట్ చేయాలంటే ఛలో సికింద్రాబాద్.

**మటన్‌కా.. బాద్'షా'**

షాగౌస్ పేరు తెలియని మాంసాహార ప్రియులు సిటీలో ఉండరేమో. ఆ క్రమంలోనే హాలీమ్ లవర్స్‌నూ తనదైన శైలితో ఆకట్టుకుంటోంది. వినియోగించే మాంసపు రుచి పరంగా ఫ్యాన్స్‌ను దక్కించుకున్న ఈ రెస్టారెంట్ సిటీలోని లక్డికాపూల్, టోలిచౌకి, గచ్చి'చిలి షాలీబండాల్లో ఉంది.

**ఆదాబ్.. షాదాబ్..**

ఓల్డ్ సిటీ నడి'డ్డున ఉన్న షాదాబ్ హోటల్ ప్రతి రంజాన్‌కు హాలీమ్ ఆదరణలో అగ్రగామిగా ఉంటుంది. నాణ్యమైన ముడిదినుసులు సాంప్రదాయ వంట శైలిని ఉపయోగించడం వీరి ప్రత్యేకత. ఘాన్సీ బజార్‌లో షాదాబ్ ఉంది.

# నైస్.. రైస్! రుచికరంగా.. కొత్తదనంగా..!



ఉదయాన్నే పాఠశాలకు వెళ్లే పిల్లలకు, ఉద్యోగ, వ్యాపార కార్యకలాపాలకు సిద్ధమయ్యే పెద్దవారికి లంచ్ బాక్సు కట్టడానికి ఇంట్లో రోజూ హడావుడి కనిపిస్తుంది. తక్కువ సమయంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నానికి భోజనం, బ్రేక్ సమయంలో స్నాక్స్ అన్నీ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఇటువంటి సమయంలో ఆహారంలో కొద్దిగా ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా బాక్సు అలాగే తిరిగి ఇంటికి వచ్చేస్తుంది. నిత్యం రొటీన్ క్యారేజీ కడితే పిల్లలు తినడానికి అంతగా ఇష్టపడరు. ఈ నేపథ్యంలో అటు పిల్లలు ఇష్టపడేలా.. ఇటు పోషకాలు అధికంగా ఉండేలా.. ఆహార నిపుణుల సూచనలతో కొన్ని రెసిపీలు మీ కోసం.వంటింట్లో టమాటా రైస్, ఎగ్ రైస్, జీరా రైస్, పుదీనా రైస్, పెరుగన్నం, అప్పుడప్పుడు వెజ్, నాన్‌వెజ్ ఫ్రైడ్ రైస్ వంటివి తెలిసిన వంటకాలు. అలాగే ఆరోగ్యం అందించే కరివేపాకు రైస్, ఉల్లి రైస్, కాలిఫ్లవర్ రైస్ వంటివి కూడా ట్రై చేయండి. తయారీకి తక్కువ సమయం, తినడానికి రుచికరంగా ఉంటాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల లంచ్ బాక్సుకు ఉపయోగకరంగా ఉంటాయి.

**కరివేపాకు అన్నం..**

జీర్ణశక్తిని పెంపొందించడంలో కరివేపాకు ఉపయోగపడుతుంది. అందుకే తరతరాలుగా అన్ని వంటల్లో కొంచెమైనా కరివేపాకు వేస్తారు. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయినా పిల్లలు, పెద్దల్లో కొంత మంది మాత్రం కరివేపాకులు కనిపిస్తే తీసి పక్కన పడేస్తారు. అటువంటి వారికోసం కరివేపాకు రైస్ చేసి పెడితే చకచకా తినేస్తారు. కరివేపాకుల వల్ల కలిగే లాభాలన్నీ వారికి అందుతాయి. వంట వేగంగా అయిపోతుంది.

బియ్యం కడిగి, నీటిని వడపట్టి పక్కన పెట్టుకోవాలి.స్టవ్‌పై పాత్ర పెట్టి టీస్పూను నూనె, ఒకటిన్నర కప్పు కరివేపాకు ముక్కలు, కొబ్బరి తురుము కలిపి ఒక నిమిషం వేయించాలి.చల్లారిన తరువాత మిక్సీలో రుబ్బుకోవాలి. మరో పాత్రలో నూనె, లవంగాలు, పచ్చి మిర్చి ముక్కలు, ఉల్లి ముక్కలు, షాజీరా, అల్లం వెల్లుల్లి పేస్టు వేయించాలి. అప్పటికే కడిగి పెట్టుకున్న బియ్యాన్ని వేయాలి. అందులో కరివేపాకు పేస్ట్, ఉప్పు, నిమ్మరసం వేసి కలపాలి.బియ్యం పలుగ్గా ఉడికిన తరువాత సిమ్‌లో కొద్దిసేపు ఉంచాలి. అంతే కరివేపాకు అన్నం రెడీ.

**కాలిఫ్లవర్ రైస్..**

కాలిఫ్లవర్ ఆరోగ్యానికి మంచిది. కూరలు, ఫ్రై చేయడానికి, వెజ్ మంచూరియా వంటి వంటకాల్లో వాడుతుంటారు. కాలిఫ్లవర్ రైస్ ట్రై చేయాలనుకుంటే మాత్రం ఇలా చేయండి.

- బియ్యం 80 శాతం ఉడికించి పక్కన పెట్టుకోవాలి.
- మరో పాత్రలో తరిగిన కాలిఫ్లవర్ ముక్కలను ఉప్పు, పసుపు వేసి 10 నిమిషాల పాటు ఉడికించాలి.
- అనంతరం నీటిని వడగట్టి ముక్కల్ని ఆరబెట్టుకోవాలి.
- జీలకర్ర, అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి, బఠాణీలు వేసి తాలింపు సిద్ధం చేసుకోవాలి.
- అందులో కాలిఫ్లవర్ ముక్కలు వేసి, గరం మసాలా కలపాలి.
- వేగిన తరువాత ఉడకబెట్టిన అన్నం వేసి, అవసరమైనంత ఉప్పు వేసి కలపాలి.
- అన్నం పూర్తిగా ఉడికే వరకూ చూసుకోవాలి. చివరిగా కొత్తిమీర వేసుకుంటే కాలిఫ్లవర్ రైస్ సిద్ధమైనట్లే.

**ఉల్లి రైస్..**

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని నానుడి. ఆరోగ్యపరంగా ఉల్లికి అంత ప్రాముఖ్యత ఉందన్నమాట. కూరలు, ఇతర రెసిపీలు తయారీలోనే కాదు, ఉల్లి రైస్‌ని ట్రై చేయాలనుకుంటే మాత్రం ఇది చూడండి.

- ఉల్లిని మనకు నచ్చిన రీతిలో (నిలువుగా, అడ్డంగా) ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. బియ్యం కడిగి ఉంచుకోవాలి.
- పొయ్యిపై పాత్ర పెట్టి నూనె వేడెక్కాక జీలకర్ర, ఆవాలు, మినపప్పు, శెనగపప్పు వేయించాలి.
- కరివేపాకులు వేసి వేగాక, తరిగిన ఉల్లి ముక్కలు, పచ్చి మిర్చి, యాలుకలు, లవంగాలు వేసి వేయించాలి.
- తరువాత కడిగి సిద్ధం చేసుకున్న బియ్యం వేసి బాగా కలపాలి.
- అవసరమైనంత ఉప్పు వేసుకోవాలి. అన్నం ఉడికిన తరువాత దించితే సరిపోతుంది.



# వీ ఆర్ వీగన్స్

**నగరంలో వీగనిజంపై అవగాహన ప్రచారం ప్రారంభం**

**మెర్సీ ఫర్ యానిమల్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**వీగనిజం ప్రాముఖ్యత తెలియజేస్తున్న సినీతార దక్ష నాగర్కర్**




కొన్ని సంవత్సరాలుగా వీగన్స్, వీగనిజంపై విస్తృతంగా అవగాహన పెరుగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో వీగనిజంకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, ప్రాముఖ్యత తెలిపే సదస్సులు నిర్వహిస్తున్నారు. జంతు సంరక్షణ, మూగజీవాల హక్కుల కోసం పాటు పడటం వంటి అంశాలపై వీగన్లు, వీగన్ సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా నగరం వేదికగా మెర్సీ ఫర్ యానిమల్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీతార దక్ష నాగర్కర్ భాగస్వామ్యంతో మొక్కల ఆధారిత ఆహార జీవనాన్ని ప్రోత్సహించే అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు. స్వతాహ వీగన్ అయిన దక్ష నాగర్కర్ వీగనిజం ప్రాముఖ్యత, జంతువులపై హింస వద్దంటూ ఈ ప్రచారం ద్వారా తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో వీగనిజం గురించి, ప్రస్తుత తరుణంలో దాని ప్రాధాన్యత.. తదితర అంశాల గురించి 'సాక్షి'తో పంచుకుంది. ప్రస్తుత మానవ జీవన విధానం జంతువులను అత్యంత హీనంగా హింసిస్తోంది. ముఖ్యంగా మాంసం కోసం 2, 3 నెలల జంతువులను కృత్రిమ విధానాలతో బలవంతంగా ఎక్కువ బరువు పెంచి సృష్టి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా డైరీ ఫామ్స్, పౌల్ట్రీ, పిగ్ ఫామ్స్‌లో కనీసం ఒక జంతువు స్వేచ్ఛగా తిరగకుండా కేజ్‌లలో బంధించి వాటి ఉత్పత్తులను సేకరిస్తున్నారు. కొన్ని జంతువులైతే వాటి జీవిత కాలంలో సూర్యరశ్మికి కూడా చూడకుండా పెరుగుతున్నాయి. ఇది జీవవైవిధ్యానికి విరుద్ధం. దేశంలో జనాభా పెరిగిపోయింది, ఇంతమందికి సరిపడా జంతు ఉత్పత్తులు అందించలేక, బ్యాలెన్స్ చేయలేక అనైతిక బ్రీడింగ్‌తో హింసిస్తున్నారు. ఈ సందర్భంగా 'పవర్డ్ బై వెజ్జీస్' అంటూ కూరగాయలను మాత్రమే తినాలని ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఫ్యాక్టరీలు, వాహనాల కాలుష్యం కన్నా ఫ్యాక్టరీ ఫార్మమింగ్‌తో ఎక్కువ కాలుష్యం జరుగుతోంది. ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం కోసం బాగా స్పందిస్తున్నారు. వారి జీవనంలో కొనసాగుతున్న ప్రాంతీయ వీగన్ వంటకాల విశిష్టతను తెలుసుకుంటున్నారు. కానీ నగరాల్లో మొక్కలకు కూడా ప్రాణం ఉంటుంది కదా అని వాదిస్తున్నారు. కానీ మొక్కల్లో స్టిమ్యులే మాత్రమే ఉంటుంది, జంతువుల్లో వలె నొప్పిని తెలియజేసే నాడీ వ్యవస్థ ఉండదని అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. వీగన్స్ అంటే మాంసాన్ని మాత్రమే కాదు.. పాలు, పెరుగు, గుడ్లు వంటి జంతు పదార్థాలతో పాటు జంతు ఉత్పత్తులతో తయారు చేసిన బ్యాగ్‌లు, దుస్తులు ఏ ఇతర వస్తువులను వినియోగించరు.జంతువులకు వాటి స్వేచ్ఛను ఇవ్వడంతో పాటు హింసకు దూరం చేయడం అవసరం. నేను నటించిన జాంబిరెడ్డి సినిమా షూటింగ్ సమయంలో మా దర్శకులు ఒక మేకను ఎంత జాగ్రత్తగా, సురక్షితంగా చూసుకున్నారో చూసి సంతోషపడ్డాను. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జంతువుల హింసించకూడదనే అంశంపై కొత్త చట్టాలను వెలువరించారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం కూడా జంతు పెంపకాలపై దృష్టి సారిస్తూ నియమాలను పాటిస్తుంది. సినిమాల విషయానికొస్తే త్వరలో మరో 2 సినిమాలు చేస్తున్నాను. తెలుగు ప్రజలకు దగ్గరవ్వడం చాలా సంతోషంగా ఉంది.

**జంతు సంరక్షణే**

లక్ష్యంగా 2016లో ప్రారంభించిన మెర్సీ ఫర్ యానిమల్స్ ఇండియా ఫౌండేషన్ దేశవ్యాప్తంగా కృషి చేస్తోంది. సంస్థ పోరాటంలో భాగంగా దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో క్రూరంగా పందులను పెంచడం నిషేధించారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం కూడా ఉంది. శాఖాహారం, మాంసాహారం ఉన్నట్లుగానే వీగన్ ఫుడ్‌కు కూడా లేబుల్ ఉండేలా మార్పు తీసుకొచ్చాం. జాన్ అబ్రహం, సోనాక్షి సిన్హా, సాక్షి మల్లిక్ మాదిరిగానే హైదరాబాద్‌లో వీగనిజం కోసం దక్షా నాగర్కర్ క్యాంపెయిన్ చేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం ఒక జంతువును చంపితే రూ.50 ఫైన్ కట్టి హాయిగా తిరుగుతున్నారు. ఒక మనిషిని చంపితే ఎలాంటి చట్టం ఉంటుందో జంతు హత్యలపై కూడా కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఉన్నత న్యాయస్థానాలకు విన్నవించాం.

# హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ



హెచ్‌సీఎల్ టెక్నాలజీ..హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు. హై-టెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందన్నారు.

**విప్రో కన్స్యూమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్**

హైదరాబాద్, జనవరి 21: విప్రో అనుబంధ సంస్థయైన విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంస్థ..హైదరాబాద్‌లో ఐవోటీ ఆధారిత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో అత్యాధునిక లైటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, దేశంలో ఇది రెండో సెంటర్‌ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అనూజ్ ధీర్ తెలిపారు.

# ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్!

## పరిచయం చేసే యోచనలో సెబీ

## గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టడానికే



గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని చూస్తున్నట్టు చెప్పారు. రెండు అగ్రశ్రేణి ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలు ఈ పనిలోనే నిమగ్నమయ్యాయని, త్వరలోనే ఓ పోర్టల్ ప్రారంభం కావచ్చన్నారు. సదరు లావాదేవీలన్నీ ఇందులో నిక్షిప్తమవుతాయని, కంపెనీల్లో పాలనాపరమైన ప్రమాణాలను నిర్వహించడంలోనూ ఇది దోహదపడగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

**సెబీ ఏం చేప్తున్నదంటే..**

ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు, ఆథరైజ్డ్ కాని డీలర్ల నడుమ అనధికార, నియంత్రణలేని క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటినే గ్రే మార్కెట్ కార్యకలాపాలుగా పేర్కొంటున్నారు. అందుకే అనధికారికంగా జరుగుతున్న ఈ లావాదేవీలకు.. మదుపరులు కోరుకుంటే సక్రమ రీతిలో ఎందుకు జరుగడానికి అవకాశం ఇవ్వొద్దని ఆలోచించామని బచ్ చెప్తున్నారు. ఐపీవోలో షేర్ల కేటాయింపు జరిగిందంటే అది లీగలేనని, వాటిని అమ్ముకునే హక్కు కొన్నవారికి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌కు అనుమతిచ్చే దిశగా వెళ్తున్నట్టు తెలిపారు.

## హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్

# టెక్ కొత్త డెలివరీ సెంటర్ ప్రారంభం..!



ప్రముఖ ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లోని తన గ్లోబల్ డెలివరీ ఫుట్ ప్రింట్ ను విస్తరిస్తున్నట్లు తెలిపింది. హైటెక్ సిటీలో 5000 మంది ఉద్యోగులు పని చేయగల సామర్థ్యం గల కొత్త సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. హైటెక్, లైఫ్ సైన్సెస్, ఫైనాన్సియల్ సర్వీసెస్‌కతీతంగా ప్రపంచవ్యాప్తంగా పలు పారిశ్రామిక క్లయింట్లకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌పర్మేషన్ సొల్యూషన్స్, క్లౌడ్ సొల్యూషన్స్ అందించడానికి ఈ కొత్త సెంటర్ ఉపకరిస్తుంది. హైటెక్ సిటీలో 3.20లక్షల ఎస్ఎఫ్టీ విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ న్యూ సెంటర్ ప్రారంభించింది. సుస్థిర వ్యాపార పద్ధతులకు కట్టుబడి సేవలందిస్తున్నట్లు తెలిపింది. 'అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు, అత్యంత నాణ్యతతో కూడిన ప్రతిభావంతులకు వేదిక హైదరాబాద్. లోకల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌కు అనుగుణంగా గ్లోబల్ క్లయింట్ బేస్‌కు సేవలందు అందుబాటులోకి తెస్తుందీ న్యూ సెంటర్' అని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ కం మేనేజింగ్ డైరెక్టర్ సీ విజయ్ కుమార్ తెలిపారు. 2007 నుంచి హెచ్‌సీఎల్ టెక్నాలజీ హైదరాబాద్‌లో సేవలందిస్తున్నది. కొత్త సెంటర్‌తోపాటు 8,500 మంది కూర్చుని పని చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ), ఉస్మానియా యూనివర్సిటీల నుంచి వచ్చే ప్రతిభావంతులను నియమించుకుంటూ ఐటీ సేవలందిస్తోంది హెచ్‌సీఎల్ టెక్నాలజీస్.

# స్వల్పంగా పెరిగిన బంగారం ఫ్లాట్‌గా ముగిసిన వెండి



దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర స్వల్పంగా రూ.100 వృద్ధి చెంది రూ.82,100లకు పెరిగింది. ఆభరణాల తయారీలో వినియోగించే 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.100 వృద్ధితో రూ.81,700లకు చేరుకుంది. సోమవారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.82,000, 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.81,600 వద్ద స్థిర పడింది. మంగళవారం కిలో వెండి ధర ఫ్లాట్‌గా రూ.93,000 వద్ద కొనసాగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఫిబ్రవరి డెలివరీ తులం బంగారం ధర రూ.426 వృద్ధితో రూ.78,970లకు చేరుకుంది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ అనలిస్ట్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది స్పందిస్తూ 'ఎంసీఎక్స్‌లో తులం బంగారం ధర లాభ పడి రూ.79 వేలకు చేరుకుంది. మెక్సికో, కెనడాల నుంచి దిగుమతులపై సుంకాలు పెంచుతామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఎంసీఎక్స్‌లో బంగారం ధర పెరిగింది' అని వ్యాఖ్యానించారు. కిలో వెండి మార్చి డెలివరీ ధర రూ.188 (0.21 శాతం) పెరిగి రూ.91,630లకు చేరుకుంది. గ్లోబల్ మార్కెట్లలో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 18.20 డాలర్లు (0.66 శాతం) పెరిగి 2,730.50 అమెరికా డాలర్లకు చేరుకుంది. బులియన్ మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం మంగళవారం ట్రేడింగ్‌లో గతేడాది నవంబర్ ఆరో తేదీన జీవిత కాల గరిష్టాన్ని తాకి ప్రస్తుతం 2,725 డాలర్ల వద్ద నిలిచింది. తాజాగా సుంకాలు పెంచుతామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన అంతర్జాతీయంగా ట్రేడ్ వార్‌కు దారి తీస్తుందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఈ ఏడాది రెండు సార్లు వడ్డీరేట్లను యూఎస్ ఫెడ్ రిజర్వ్ తగ్గిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవల పెరిగిన యూఎస్ ట్రెజరీ బాండ్ల ధరలతో బులియన్ మార్కెట్ ధరల్లోనూ కరెక్షన్ నమోదవుతుందని తెలుస్తోంది. సిల్వర్ కామెక్స్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ వెండి ధర 31.10 డాలర్లు పలికింది. తాజాగా అమెరికాలో ఎటువంటి ఆర్థిక డేటా వెలువడలేదు. కానీ అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విధానాల నిర్ణయాలపై వ్యాపారులు, ఇన్వెస్టర్లు దృష్టిని కేంద్రీకరించారని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ట్రంప్ విధాన నిర్ణయాలను బట్టే బులియన్ మార్కెట్లో ఒడిదొడుకులు నెలకొంటాయని చెప్పారు.

# మార్కెట్‌కు ట్రంప్ సెగ

## మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న అంచనాలు

## భారీ నష్టాల్లో దేశీయ సూచీలు

## సెన్సెక్స్ 1,235, నిఫ్టీ 320 పాయింట్లు డౌన్



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. ఉదయం ఆరంభంలో లాభాల్లో కదలాడినా.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,235.08 పాయింట్లు లేదా 1.60 శాతం కోల్పోయి 75,838.36 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,431.57 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ కూడా 320.10 పాయింట్లు లేదా 1.37 శాతం దిగజారి 23,024.65 వద్ద స్థిరపడింది. గత ఏడాది జూన్ 6 తర్వాత ఈ స్థాయికి సూచీ రావడం ఇదే తొలిసారి. కాగా, ఇంట్రా-డేలోనైతే 367.90 పాయింట్లు పతనమైంది.

**ఇదీ సంగతి..**

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా దెబ్బతీశాయి. అగ్రరాజ్య రక్షణాత్మక ధోరణులతో ఇతర దేశాల ఆర్థికావకాశాలు క్షీణిస్తాయన్న భయాందోళనలు మదుపరుల్లోనూ చెలరేగాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్లలో అలజడి చోటుచేసుకున్నది. నిజానికి ఎన్నికల ప్రచారంలోనే పొరుగు దేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై సుంకాలను 10 నుంచి 20 శాతం విధిస్తామని, చైనా నుంచి వస్తున్నవాటికైతే టారీఫ్‌లు 60 శాతంగా ఉంటాయని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడూ ట్రంప్.. సుంకాల సమరానికి కాలు దువ్విన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడూ అదే సంకేతాలు వస్తున్నాయి. వచ్చే నెల మొదలు కెనడా, మెక్సికోల నుంచి జరిగే దిగుమతులపై దాదాపు 25 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నామని ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఆ రెండు దేశాల నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలు జరుగుతున్నాయని, నార్కోటిక్స్ వస్తున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. వీటిని అరికట్టేందుకే సుంకాలను పెంచాలని చూస్తున్నట్టు చెప్పారు. మున్ముందు ఇతర దేశాలపైనా ట్రంప్ ఇదే దుందుడుకు వైఖరి ఉంటుందన్న అంచనాలొస్తున్నాయి.

**రంగాలవారీగా..**

రియల్టీ రంగ షేర్లు గరిష్ఠంగా 4.22 శాతం నష్టపోయాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం, సర్వీసెస్ 2.86 శాతం, పవర్ 2.63 శాతం, టెలికం 2.52 శాతం చొప్పున తగ్గాయి. జొమాటో షేర్ విలువ అత్యధికంగా 10.92 శాతం పడిపోగా.. ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లూ పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్ సూచీలు లాభపడగా.. చైనా, దక్షిణ కొరియా ఇండెక్స్‌లు నష్టపోయాయి. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు ఒక్కరోజే రూ.5,920 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్చేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

**మార్కెట్ విలువ డౌన్**


స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా అదే రీతిలో క్షీణించింది. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.7.52 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 7,52,520. 34 కోట్లు తరిగిపోయి రూ.4,24,07, 205.81 కోట్లు లేదా 4.90 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. బీఎస్ఈలో మొత్తం 4,088 షేర్లు ట్రేడ్ అవగా, 2,881 షేర్లు నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 2 శాతం, స్మాల్‌క్యాప్ 1.94 శాతం చొప్పున నిరాశపర్చాయి.

**నష్టాలకు ప్రధాన కారణాలు**

- అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
- వాణిజ్య యుద్ధం దిశగా ట్రంప్ అడుగులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం
- భారత్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం

## ట్రంప్ సుంకాల ఎఫెక్ట్.. దేశీయ స్టాక్ మార్కెట్లలో

# రూ.7.52 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి..!



దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లు భారీగా విక్రయానికి దిగడంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.7.52లక్షల కోట్లు హరించుకుపోయింది. మంగళవారం బీఎస్ఈ ఇండెక్స్ సెనెక్స్ 1,235 పాయింట్లకు పైగా నష్టపోయింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7,52,520.34 కోట్లు పతనమై రూ.4,24,07,205.81 కోట్ల (4.90 లక్షల కోట్ల అమెరికా డాలర్లు)కు చేరుకుంది. బీఎస్ఈలోని 4,088 షేర్లలో 2,881 స్టాక్స్ పతనం అయ్యాయి. కేవలం 1,106 షేర్లు లాభ పడితే, 101 స్టాక్స్ యధాతథంగా ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెనెక్స్ 1,235.08 పాయింట్లు (1.60 శాతం) నష్టంతో 75,838.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1,431.57 పాయింట్లు నష్టపోయి 75,641.87 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోగా, తిరిగి 77,337.36 పాయింట్ల గరిష్టానికి చేరుకుంది. "దేశీయ స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడింగ్ సాగినా నష్టాలతోనే ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించే సుంకాలపై అనిశ్చితితో విదేశీ ఇన్వెస్ట్మెంట్ సంస్థలు, ఇన్వెస్టర్లు షేర్ల అమ్మకానికి దిగారు. దీనికి తోడు దేశీయ కార్పొరేట్ సంస్థల తృతీయ త్రైమాసికం ఆర్థిక ఫలితాలు నిరాశ పరిచాయని స్టోక్‌బాక్స్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ అమేయ రణదివే చెప్పారు. తృతీయ త్రైమాసికం ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉంటడంతో ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జోమాటో షేర్లు 10.92 శాతం పతనం అయ్యాయి. బీఎస్ఈలో ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ తదితర స్టాక్స్ భారీగా నష్టపోయాయి. కేవలం అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు మాత్రమే లాభ పడ్డాయి. బ్రాడర్ మార్కెట్‌లో బీఎస్ఈ మిడ్ క్యాప్ రెండుశాతం, స్మాల్ క్యాప్ 1.94 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలో రియాల్టీ 4.22 శాతం నష్టపోగా, తర్వాతి స్థానాల్లో కన్జూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం, కన్జూమర్ డిస్క్రిషనరీ 2.90 శాతం, సర్వీసెస్ 2.86 శాతం, పవర్ 2.63 శాతం, టెలికమ్యూనికేషన్స్ 2.52 శాతం, యుటిలిటీస్ 2.35 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలోని 13 సెక్టార్లు నష్టాలతోనే ముగిశాయి. రియాల్టీ, కన్జూమర్ డ్యూరబుల్ సెక్టార్లు అధిక ఒత్తిడికి గురయ్యాయి. ఇదిలా ఉంటే మంగళవారం కల్లా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.5,920 కోట్ల విలువైన పెట్టుబడులు ఉపసంహరించారు.

# నా మొదటి సంపాదన రూ.10,000



ప్రముఖ పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ తన వ్యాపార, పారిశ్రామిక ప్రస్థానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. జీవిత అనుభవాలతోనే ఎవరికైనా వివేకం వస్తుందన్నారు. విజ్ఞానం మాత్రం బాగా చదివితేనే వస్తుందన్నారు. అహ్మదాబాద్‌లో అదానీ గ్రూప్ ఏర్పాటు చేసిన అదానీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ జీవిత సత్యాలు చెప్పారు. కాలేజీ మానేసి 16 ఏళ్ల వయసులో కేవలం రైలు టిక్కెట్‌కు సరిపడా డబ్బులతో ముంబై చేరిన తాను ఎన్ని కష్టాలు పడిందీ వివరించారు. చిన్న వయసులోనే బతుకుదెరువు కోసం ముంబై చేరడం, అక్కడ ఒక వజ్రాల ట్రేడింగ్ కంపెనీలో చేరి మూడేళ్లలోనే ఆ వ్యాపారంలోని మెళకువలు ఆకళింపు చేసుకుని వజ్రాల ట్రేడింగ్ కోసం సొంత బ్రోకరేజీ సంస్థను ఏర్పాటు చేసిన విధానాన్ని వివరించారు. ఈ బ్రోకరేజీ వ్యాపారంలో 1981లో 19 ఏళ్ల వయసులో తొలి ట్రేడింగ్‌లోనే రూ.10,000 కమీషన్ సంపాదించిన విషయాన్నీ ఆయన వెల్లడించారు. 'ఒక జపాన్ కొనుగోలుదారుడితో నేను జరిపిన మొదటి ట్రేడింగ్ నాకు ఇంకా గుర్తుంది. ఆ తొలి ట్రేడింగ్‌లోనే నాకు రూ.10,000 కమీషన్ లభించింది. అప్పుడు నా వయసు 19 సంవత్సరాలు. ఒక ఔత్సాహిక వ్యాపారవేత్తగా అది నా తొలి ప్రయాణం' అన్నారు. అంచెలంచెలుగా ఎదిగా: ఆ తరువాత అహ్మదాబాద్‌కు తిరిగి వచ్చి తన అన్న కొనుగోలు చేసిన ఒక చిన్న పీవీసీ ఫిల్మ్ ఫ్యాక్టరీ నడపడంలో సహాయ పడడం, 1988లో సొంతంగా అదానీ ఎక్స్‌పోర్ట్స్ పేరుతో కమోడిటీస్ ట్రేడింగ్ సంస్థను ఏర్పాటు చేసి, అంచెలంచెలుగా ఎలా వివిధ వ్యాపారాల్లో ఎదిగిందీ అదానీ విద్యార్థులకు వివరించారు. జీవితంలో ఎన్ని అపజయాలు, ఎదురుదెబ్బలు తగిలినా ఎదగాలనే లక్ష్యం నుంచి నీరుగారి పోవద్దని విద్యార్థులను కోరారు. జీవితంలో ఎదగాలని కలలు కనడం సంపన్నులకు మాత్రమే పరిమితమైన సొత్తు కాదన్నారు.

## భారత్ నుంచి బ్రిటన్ దోచుకున్న సొమ్ము రూ.5,607 లక్షల కోట్లు

### అందులో సగం 10 శాతం సంపన్నుల చేతుల్లోకే..

### జూఆ డబ్బుతో లండన్ ఉపరితల భాగాన్ని

### 50 పౌండ్ల నోట్లతో నాలుగు సార్లు కప్పేయొచ్చు..



శతాబ్దకాలానికి పైగా భారత్‌ను పాలించిన బ్రిటన్ మన దేశ సంపదను భారీగా కొల్లగొట్టిన విషయం అందరికీ తెలిసిందే. భారత్ నుంచి బ్రిటన్ ఎంత మేర దోచుకుందనే విషయంపై ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ బయటపెట్టింది. 1765 నుంచి 1900 మధ్య కాలంలో జరిగిన వలస పాలనలో బ్రిటన్ మన దేశం నుంచి ప్రస్తుత విలువ ప్రకారం 64.82 లక్షల కోట్లు డాలర్లు (సుమారు రూ.5,607 లక్షల కోట్లు) దోచుకుందని ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక అంచనా వేసింది. అందులో 52 శాతం.. అంటే 33.8 లక్షల కోట్ల డాలర్లు (రూ.2,924 లక్షల కోట్లు) 10 శాతం సంపన్నుల జేబుల్లోకే వెళ్లిందని నివేదిక పేర్కొంది. ఆ డబ్బుతో బ్రిటన్ రాజధాని లండన్ ఉపరితల భాగాన్ని 50 పౌండ్ల నోట్లతో నాలుగు సార్లు కప్పేయవచ్చని అంటోంది. ప్రస్తుతం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని చాలావరకు కుబేర కుటుంబాల సంపద వలసపాలన సమయంలో ఆర్జించిందేనని రిపోర్టు పేర్కొంది. 1750లో ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 25 శాతం వాటా భారత ఉపఖండానిదేనని, 1900 నాటికది 2 శాతానికి పడిపోయిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332